**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 సంచిక :112 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ గురువారం 10 సెప్టెంబర్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




# భూముల భద్రతే లక్ష్యం

- వచ్చే మార్చి నాటికి సమస్యలన్నీ పరిష్కరిస్తాం: సీఎం చంద్రబాబు
- గొడ్డలి పార్టీ అధ్యక్షుడి అరాచకాలు..
- తండ్రి భరించలేకపోయారు
- ప్రతీకారం తీర్చుకునేందుకు నిమిషం చాలు... కానీ సహనంతో వ్యవహరిస్తా
- నన్ను ఇబ్బంది పెట్టినట్టే... పవన్ కళ్యాణ్‌నూ వేధించారు
- పి.గన్నవరం సభలో సీఎం చంద్రబాబు



**పి.గన్నవరం**

రాజకీయ కక్షలకు తాను ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వనని... ప్రజల కోసం... రాష్ట్రాభివద్ధి కోసం సహనంతో.. ఓపిగ్గా ఉండడం తనకు అలవాటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విలువలతో కూడిన రాజకీయం, పేద ప్రజలకు మెరుగైన జీవితం, తెలుగుజాతి అభివద్ధి కోసం తాను నిరంతరం ఆలోచిస్తానని స్పష్టం చేశారు. మీ భూమి--మీ హక్కు కార్యక్రమంలో భాగంగా బుధవారం కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పందువారిపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. దీంట్లో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు కొన్ని కీలకాంశాలను ప్రస్తావించారు.

వివరాలు 2లో..



## భారత్, రష్యా రక్షణ ఒప్పందం

- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్?!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు



## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

- సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది: సుప్రీంకోర్టు
- ఎన్‌సీఈఆర్‌టీపై కీలక వ్యాఖ్యలు చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని వెల్లడి
- అయితే వాటిని సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా వ్యక్తం చేయాలని సూచన



## స్థానిక ఎన్నికల్లో గట్టిగా నిలబడాలి

- దౌర్జన్యాలతో పాలకులు ఎప్పటికీ రాజ్యం చేయలేరు
- వైయస్ఆర్‌సీపీ జెండా ఎగరాలి
- నాయకులు, కార్యకర్తల సమావేశంలో వైసీపీ అధినేత జగన్
- పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు వైయస్ జగన్

**తాడేపల్లి**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు గట్టిగా నిలబడి పోరాడాలని వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైయస్ఆర్‌సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పర్చూరు నియోజకవర్గ పరిస్థితులు,

వివరాలు 2లో..

## ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

- కాంగ్రెస్ కంటే 7 రెట్లు ఎక్కువ
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.1,472.8 కోట్ల నిధులు
- కాంగ్రెస్ మొత్తం రూ.207.17 కోట్లు
- ఈసీకి సమర్పించిన ఖర్చుల వివరాల్లో వెల్లడి



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

- సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్
- రెండో కూటమి సమన్వయ సమావేశంలో నిర్ణయం
- ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందన్న తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు



## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రవాణా సౌకర్యాలేంటి?



- అఫిడవిట్ వేయాలని హైకోర్టు ఆదేశం
- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రవాణా సదుపాయాలపై న్యాయస్థానం ఆరా
- అన్ని అంశాల గురించి వివరాలు సమర్పించాలని ఆదేశాలు
- సమగ్ర వివరాలు కోరిన హైకోర్టు

**అమరావతి**

విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రవాణా సదుపాయాలపై హైకోర్టు స్పందించింది. విశాఖపట్నం నగరం నుంచి ఈ కొత్త విమానాశ్రయానికి ప్రజా రవాణా (కనెక్టివిటీ) సరిగ్గా లేకపోవడం వల్ల ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా విమానాశ్రయం చేరుకునేందుకు

వివరాలు 2లో..

## ప్రభుత్వ పథకాల అర్హులను ఇట్టే గుర్తించొచ్చు



- ఐఐటీ కాన్పూర్ ఏఐ 'ఫ్యామిలీ స్కోర్'
- ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించేందుకు ఏఐ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేసిన ఐఐటీ కాన్పూర్
- సమయంతో పాటు డబ్బు ఆదా
- ఏపీ ప్రభుత్వంతో ఐఐటీ కాన్పూర్ సహకార ఒప్పందం

**అమరావతి**

ఇప్పటికే ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న డేటాను ఉపయోగించి, సంక్షేమ పథకాలకు అర్హులయ్యే కుటుంబాలను గుర్తించే ఫ్యామిలీ స్కోర్ అనే ఏఐ ఆధారిత వ్యవస్థను ఐఐటీ కాన్పూర్ అభివృద్ధి చేసింది. దీని ద్వారా ఇంటింటికీ సర్వేల అవసరం లేకుండానే ఓ కుటుంబానికి సంబంధించిన సామాజిక ఆర్థికస్థితిని అంచనా వేయడానికి వీలు కలుగుతుంది. తద్వారా తక్కువ ఖర్చుతో పాటు తక్కువ సమయంలోనే అర్హులైన కుటుంబాలను గుర్తించడం సాధ్యమవుతుంది. అంటే ఏ కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అవసరమో 'ఫ్యామిలీ స్కోర్' ద్వారా తెలుసుకోవచ్చు. ఈ మేరకు ఐఐటీ కాన్పూర్, ఏపీ ప్రభుత్వం మధ్య ఓ సహకార ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా కుటుంబాల సామాజిక ఆర్థికస్థితిని ఏఐ అంచనా వేయగలదా? లేదంటే సాధారణంగా చేపట్టే ఇంటింటి సర్వేలను భర్తీ చేయగలదా? అనే అంశాన్ని ప్రయోగాత్మకంగా తొలి దశలో పరిశీలించారు. ఈ క్రమంలోనే ఇంటింటి సర్వేల కంటే ఐఐటీ కాన్పూర్ అభివృద్ధి చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ వ్యవస్థ

వివరాలు 2లో..

# భూముల భద్రతే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

మూడేళ్ల క్రితం సీఎం చంద్రబాబును నాటి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని... ఆ అక్రమ అరెస్ట్ జరిగి సెప్టెంబర్ 9కి సరిగ్గా మూడేళ్లు అయిందంటూ నాటి సంగతులను ఆవేదనతో ప్రస్తావించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నాడు జరిగిన అంశాలను బహిరంగ సభలో గుర్తు చేసుకున్నారు. నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన సమయంలో మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న అర్ధరాత్రి వచ్చి తనను అరెస్టు చేస్తామని చెప్పారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఏ తప్పు చేయకపోయినా అర్ధరాత్రి పూట తనను అరెస్టు చేశారని తెలిపారు. తనపై ఉన్న ఆరోపణలు ఏమిటని ప్రశ్నిస్తే.. అరెస్టు చేసిన తర్వాత చెబుతామని చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన తనను ఉన్నపళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారని పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నడూ ఊహించని ఆ సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగిందని వ్యాఖ్యానించారు. తాను 48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 31 ఏళ్ల క్రితమే తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని చంద్రబాబు అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు. తనపై అనేకమంది ఆరోపణలు చేశారని, కోర్టులకు వెళ్లారని, అయితే తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయలేకపోయారని చెప్పారు. అదే తన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాజకీయాలపై కుటుంబం ఆధారపడకూడదనే ఉద్దేశంతో 36 ఏళ్ల క్రితమే కుటుంబ వ్యాపారాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. తాను ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో కుటుంబ వ్యాపారాన్ని తన సతీమణికి అప్పగించానన్నారు. తనకు ధన వ్యామోహం లేదని, తెలుగు జాతి బాగుండాలన్నదే నిరంతరం తన ఆలోచన అని స్పష్టం చేశారు. జైలులో ఉన్న సమయంలో తనకేం జరుగుతుందోనన్న ఆందోళనతో తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. నేను జైల్లో




ఉన్నప్పుడు నాకు సంఘీభావం తెలిపిన వారిని... నా గురించి ఆందోళన చెందిన వారిని జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు. రాజమండ్రి జైల్లో ఉన్న తనను కలిసేందుకు... సంఘీభావం తెలిపేందుకు కొందరు అడ్డుపడినా హైదరాబాద్‌లో టెకీలు సైతం ముందుకు వచ్చి నిరసనలు తెలిపారని సీఎం చంద్రబాబు చెప్పారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా స్పందించారన్నారు. ఇక నాడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపిన మద్దతును ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. తనకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారని చంద్రబాబు అన్నారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పవన్ కల్యాణ్ తనకు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయని, ఈడీ వంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో అచ్చెన్నాయుడు వంటి నేతలను బలవంతంగా అరెస్టు చేసి వేధించారని, పవన్ కల్యాణ్ విశాఖ వెళ్లినప్పుడు ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కి పంపించారని అన్నారు. ఇలాంటి ఘటనలు గత పాలనలో ఎన్నో జరిగాయని సీఎం పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలని చంద్రబాబు అన్నారు. కానీ తాను ఆ పని చేయలేదని స్పష్టం చేశారు. తాను సహనంగా... ఓపిగ్గా ఉంటానని వెల్లడించారు. గత పాలకులు అంతగా వేధించినా... ఏం చేయలేకపోతున్నానని చాలా మంది అనుకుంటారని.. కానీ అది తన విధానం కాదన్నారు. జగన్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చదువుకోవడానికి అమెరికా పంపిస్తే.. తిరుగుటపాలో వచ్చేశాడని స్వయంగా వైఎస్ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడిని ఎప్పుడూ ఏపీకి రానీయలేదని చంద్రబాబు అన్నారు. కొడుకుతో ఇబ్బందులు భరించలేక జగన్‌ను బెంగళూరులోనే ఉంచారని ఆయన తల్లి విజయమ్మ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారని చంద్రబాబు నాటి సంగతులను గుర్తు చేశారు.

# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు

**విజయవాడ :** మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది. ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది. మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్-టు-కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి.

**చక్రపాణి రెడ్డి బూమ్ రాంగ్ అవుతుందా**

డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది. ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

# పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు. సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద



చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు. వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది. ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.

## ప్రభుత్వ పథకాల అర్హులను ఇట్టే గుర్తించొచ్చు

-మొదటిపేజీ తరువాయి

మెరుగైన ఫలితాలను ఇస్తుందని ప్రాథమికంగా వెల్లడైంది. తద్వారా ప్రభుత్వానికి సమయం కూడా ఆదా అవుతుందనే విషయం ప్రాథమికంగా తేలింది. ఈ క్రమంలోనే ఇందుకు సంబంధించిన ఫలితాలను సీఎం చంద్రబాబుతో పాటు ఉన్నతాధికారులకు ఐఐటీ కాన్పూర్ ప్రతినిధులు వివరించారు. ఈ ప్రక్రియలో సుమారు 15 ప్రభుత్వ డేటా సెట్‌లను ఉపయోగించామని వాద్వానీ స్కూల్ ఆఫ్ ఏఐ అండ్ ఇంటెలిజెన్స్ సిస్టమ్స్ డీన్ ప్రొఫెసర్ నితిన్ సక్సేనా తెలిపారు. తద్వారా కుటుంబాల సామాజిక, ఆర్థికస్థితిని అంచనా వేసి, వాటిని నిర్దిష్ట వర్గాలుగా విభజించేలా 'ఫ్యామిలీ స్కోర్' వ్యవస్థ పని చేస్తుందని నితిన్ సక్సేనా వివరించారు.

ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సవాళ్లతో పాటు అర్హులైన కుటుంబాలను గుర్తించడంలో 'ఫ్యామిలీ స్కోర్' సహాయపడుతుందని ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మనీంద్ర అగర్వాల్ పేర్కొన్నారు. ప్రాథమిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని చెప్పారు. తద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందనే విషయాన్ని ఇవి సూచిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ సహకారంతో పౌరుల ప్రయోజనం కోసం ఏఐని పారదర్శకంగా, విశ్వసనీయంగా ఎలా ఉపయోగించవచ్చో ఇది నిరూపిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐరావత్ రీసెర్చ్ ఫౌండేషన్ సీఈవో మనీశ్? శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఐఐటీ కాన్పూర్ అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత వ్యవస్థను సీఎం చంద్రబాబుతో పాటు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రవాణా సౌకర్యాలేంటి?

-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి రవాణా సౌకర్యాలు కల్పించారు, ఏయే సమయాల్లో బస్సులు తిప్పుతున్నారు, ఎన్ని విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి, ఆయా సమయాలకు తగ్గట్టు రవాణా సౌకర్యం ఉందా తదితర వివరాలను తమ ముందు ఉంచాలని ఆదేశించింది.

**విచారణ వాయిదా వేసిన కోర్టు**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సివిల్, వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేస్తూ భోగాపురం అంతర్జాతీయ విమాశ్రయం నుంచి కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ ఈ ఏడాది జులై 28న జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావు, మరో ఇద్దరు హైకోర్టులో పిల్ వేశారు.

**ప్రయాణికుల ఇబ్బందులు**

వారి తరఫున న్యాయవాది వి.లక్ష్మీహరీశ్ వాదనలు వినిపిస్తూ భోగాపురం విమానాశ్రయం చేరుకోవడానికి పెద్ద సమస్యగా ఉందన్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది అన్నారు. బస్సుల సౌకర్యం లేదన్నారు. ఒకసారిగా విశాఖ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం భోగాపురం విమానాశ్రయానికి ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలేమిటో చెప్పాలని ఏజీని ప్రశ్నించింది.

**ప్రభుత్వ వివరణకు కోర్టు సూటి ప్రశ్న**

రాష్ట్రప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ సాధారణ రవాణా బస్సుల సౌకర్యంతో పాటు అదనంగా 20 ఎలక్ట్రికల్ బస్సులు ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నడుస్తున్నాయన్నారు. కార్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ రాత్రి ఏడు గంటల తర్వాత విమానాలు రాకపోకలు సాగించడం లేదా అని ప్రశ్నించింది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బస్సులు సరిపోవేమోనని అభిప్రాయపడింది. విమానాల రాకపోకల సమయం, ఆ సమయాల్లో కల్పించిన రవాణా సౌకర్యాలేమిటో కోర్టుకు తెలియజేయాలంటూ విచారణను వాయిదా వేసింది.

## స్థానిక ఎన్నికల్లో గట్టిగా నిలబడాలి

-మొదటిపేజీ తరువాయి

పార్టీ బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరు నుంచి తన పాదయాత్ర ప్రారంభమవుతుందని వైయస్ జగన్ తెలిపారు. పర్చూరు నియోజకవర్గం మీదుగా కూడా పాదయాత్ర సాగుతుందని చెప్పారు. గత వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలన, చంద్రబాబు రెండున్నరేళ్ల పాలన మధ్య తేడాపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోందని వైయస్ జగన్ అన్నారు. ప్రతి కార్యకర్త సగర్వంగా ప్రజల ముందుకు వెళ్లి తమ ప్రభుత్వ పాలన గురించి చెప్పుకోగలిగేలా పాలన సాగించామని తెలిపారు. మ్యానిఫెస్టోకు ఒక అర్థం తీసుకొచ్చి 99 శాతం హామీలను అమలు చేసిన చరిత్ర వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానిదని చెప్పారు. మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి ప్రతి మాటకు కట్టుబడి పనిచేశామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోతో పాటు ప్రతి ఇంటికీ బాండ్లు పంపి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రతి ఏటా బడ్జెట్ సమయంలోనే పథకాలు, కార్యక్రమాల క్యాలెండర్‌ను ప్రకటించి అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని వైయస్ జగన్ అన్నారు. వ్యవస్థలో ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్, ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజల ఇంటి గడప వద్దకే తీసుకెళ్లామని చెప్పారు. రైతులు, పిల్లలు, మహిళలు, పేదలకు అందించే పథకాలను లంచాలు లేకుండా, పూర్తి పారదర్శకంగా అమలు చేశామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు--నేడు ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివద్ధి చేశామని వైయస్ జగన్ తెలిపారు. మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, ఆరో తరగతి నుంచి డిజిటల్ బోర్డులు, బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించామని చెప్పారు. ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్ల సంఖ్యను 1,000 నుంచి 3,300కు పెంచామని, రూ.25 లక్షల వరకు వైద్యం అందించేలా పథకాన్ని విస్తరించామని తెలిపారు. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్స్, నాడు--నేడు ద్వారా ఆస్పత్రుల అభివద్ధి, ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకొచ్చామని చెప్పారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతకాలతో ప్రతి ఇంటికీ బాండ్లు పంపి అనేక హామీలు ఇచ్చారని వైయస్ జగన్ అన్నారు. అమ్మ ఒడి, ఆడబిడ్డ నిధి, రైతులకు ఆర్థిక సాయం, చేయూత, నిరుద్యోగ భతి వంటి పథకాల పేరుతో భారీగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికలు కార్యకర్తల ఎన్నికలని వైయస్ జగన్ అన్నారు. ప్రజలకు కార్యకర్తలు అండగా నిలుస్తారని, వారికి పార్టీ తోడుగా నిలవాలని చెప్పారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగం వంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, వాటిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం భవిష్యత్ సాధారణ ఎన్నికల్లో వ్యక్తమవుతుందని తెలిపారు. పాలకుడు మంచి పనులు చేసి వాటిని ప్రజలకు చూపించి ఓట్లు అడగాలని, అప్పుడు ప్రజలు ఆదరిస్తారని వైయస్ జగన్ అన్నారు. అబద్ధాలు, దౌర్జన్యాలతో ఎల్లవేళలా పాలన సాగించలేరని స్పష్టం చేశారు. జరగబోయే కురుక్షేత్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలబడి గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## సింహపురిలో రియల్ జోరు

**నెల్లూరు :** నెల్లూరు నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త దారిలో వెళ్తోంది. నగర పరిధిలోని కీలకమైన మినీ బైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్ట్ కనెక్టివిటీ రహదారుల పొడవునా సెమీ-లగ్జరీ అపార్ట్‌మెంట్లు, ఆధునిక కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు భారీగా పుంజుకున్నాయి. జాతీయ రహదారి కి, పోర్ట్ రవాణా కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాలు నివాస , వ్యాపార అవసరాలకు అనువుగా మారడంతో డెవలపర్లు సరికొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తున్నారు. కృష్ణపట్నం పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్, షిప్పింగ్ సంస్థలు, మైనింగ్ , మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలు శరవేగంగా విస్తరిస్తుండటంతో నెల్లూరు నగరంలో ఆయా కంపెనీల అధికారులు, ఇంజనీర్ల నివాస అవసరాలు పెరిగాయి. దీనికి తోడు మెరుగైన అద్దె ఆదాయం వస్తుండటంతో విదేశాల్లో ఉండే నెల్లూరు జిల్లావాసులు తమ పెట్టుబడులను మినీ బైపాస్ పరిసరాల్లోని సెమీ-లగ్జరీ ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీలపై కేంద్రీకరిస్తున్నారు. సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావిస్తూ ముందస్తుగానే అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకుంటున్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశంలో మంత్రి సత్యకుమార్.

- బీసీలు బలహీన వర్గాలు కాదు..
- ఆత్మగౌరవంలో ఎక్కడా తలవంచరు మంత్రి సత్యకుమార్ యాదవ్.
- బీసీ ప్రధానిగా దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపింది ప్రధాని నరేంద్ర మోదీనే.
- ప్రజల ఆశీర్వాదంతో ధర్మవరం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం.
- సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా బీజేపీ కార్యకర్తలు పనిచేయాలి మంత్రి.







**ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 09:** ధర్మవరం నియోజకవర్గం లోని గొట్లూరు గ్రామంలో శ్రీ సత్యసాయి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడి అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గొట్లూరు గ్రామంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ధర్మవరం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తాను అత్యధికంగా సందర్శించిన ఆలయం గొట్లూరు ఆంజనేయ స్వామి ఆలయమేనని తెలిపారు. గ్రామస్తుల ఆశీర్వాదంతోనే తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవ చేసే అవకాశం పొందానని పేర్కొన్నారు. గొట్లూరు గ్రామం అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు, ప్రజలు ఐక్యంగా నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గ్రామంలో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో రాజీపడకుండా ముందుకు సాగడం వల్ల గొట్లూరు గ్రామం జాతీయ స్థాయిలో రెండుసార్లు ఉత్తమ గ్రామంగా గుర్తింపు పొంది అవార్డులు సాధించిందని మంత్రి ప్రశంసించారు. బీసీలు బలహీన వర్గాలు కాదని, సామాజికంగా వెనుకబడి ఉండవచ్చుగానీ ఆత్మగౌరవం విషయంలో ఎవరి ముందు తలవంచే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఒక బీసీ కుటుంబంలో జన్మించిన నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, వరుసగా మూడుసార్లు ప్రజల మద్దతు పొందడం బీసీలకు గర్వకారణమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' స్ఫూర్తితో దేశంలో సమూలమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. పేదలకు ఇళ్లు, ప్రతి ఇంటికి తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ముద్రా రుణాలు, గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు, వందే భారత్ రైళ్లు, రైతులకు పీఎం కిసాన్ పెట్టుబడి సాయం వంటి అనేక కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ప్రపంచ వేదిక పై భారతదేశ ప్రతిష్టను ప్రధాని నరేంద్ర మోదీ మరింత పెంచారని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించే సేవా కార్యక్రమాలను ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పై అవగాహన కల్పించడం, అర్హులైన వారికి పథకాల ప్రయోజనాలు అందుతున్నాయా లేదా పరిశీలించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలందిస్తున్న సిబ్బందిని సత్కరించడం, విద్యార్థులతో మమేకమై వారి ఆలోచనలు తెలుసుకోవడం, 'సేవా సేతు' కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17 న సాయంత్రం ప్రతి గ్రామంలో 'ఆశీర్వాద దీపం' కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజాసేవను కొనసాగిస్తున్న ప్రధానమంత్రికి ప్రజల ఆశీస్సులు అందించాలని కోరారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి గత రెండు సంవత్సరాల్లో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. జలజీవన్ మిషన్ పనులు, దశాబ్దాలుగా రహదారులు లేని గ్రామాలకు రహదారి సౌకర్యం, ఉపాధి హామీ, వీబీజీ-రామ్‌జీ పనులు, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. కదిరి--ముదిగుబ్బ మధ్య సుమారు రూ.650 కోట్లతో హైవే అభివృద్ధి పనులు తీసుకొస్తున్నామని తెలిపారు. ధర్మవరం ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించే దిశగా ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరు చేయించామని, చేనేత కార్మికుల అభివృద్ధి కోసం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ తీసుకొచ్చామని చెప్పారు. ధర్మవరం ప్రాంతంలో వైద్య సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని, ముదిగుబ్బలో ఆస్పత్రి నిర్మాణం, గ్రామాల్లో విలేజ్ హెల్త్ సెంటర్ల ఏర్పాటు, ధర్మవరంలో డయాలసిస్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే తన విధానమని మంత్రి స్పష్టం చేశారు. ఏ పార్టీకి చెందిన వారైనా అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ సహాయం పొందేందుకు అర్హత కలిగి ఉంటే వారికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు ఓటు వేసినా, వేయకపోయినా ధర్మవరం నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరినీ తన కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేయడం తన బాధ్యతగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో వేగం పెరిగిందన్నారు. పెన్షన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు, అర్హులైన వారికి ఇంటి వద్దకే పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. 'తల్లికి వందనం', 'దీపం' వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని, చేనేత కార్మికులు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు తదితర వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు ప్రయాణ సౌకర్యం పెరగడంతో పాటు ఆరోగ్య సేవలను సులభంగా పొందే అవకాశం ఏర్పడిందని మంత్రి వివరించారు. గతంలో ఖర్చు భయంతో పెద్ద ఆస్పత్రులకు వెళ్లని మహిళలు, ఇప్పుడు ఉచిత బస్సు సదుపాయంతో మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ సంఖ్య పెరగడం ప్రజలు వైద్య సేవలను మరింతగా వినియోగించు కుంటున్నారనడానికి నిదర్శనమన్నారు.

ఆయుష్మాన్ భారత్ ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వైద్య సహాయం అందుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి పిలుపు నిచ్చారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలు తన పై ఉంచిన నమ్మకానికి, అందించిన ఆశీర్వాదాలకు రుణపడి ఉంటానని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, ఓబీసీ ఇన్చార్జి కాపు రామచంద్ర రెడ్డి, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శులు చంటి, అశోక్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణ యాదవ్, శ్రీ సత్యసాయి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు అనిల్ ఓబీసీ జిల్లా ఇన్చార్జి రామాంజనేయులు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, ఓబులేసు, తదితరు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజం గెలిచింది కార్యక్రమంలో చింతమనేని.






**దెందులూరు, పెన్ సత్తా, సెప్టెంబర్ 09:** నియోజకవర్గంలో రాష్ట్రానికే ఆదర్శంగా 'నిజం గెలిచింది' కార్యక్రమం వినూత్నంగా 53 ప్రార్థనా మందిరాల్లో ఏకకాలంలో దీపోత్సవంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాలుగు మండలాల్లోని 53 ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో సాయంత్రం 6 గంటలకు ఏకకాలంలో కొవ్వొత్తులు, దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలతో,దుగ్గిరాలలో 53 కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. పరిశీలకురాలు ఇందిరా ప్రియదర్శితో కలిసి, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఒక నిష్కళంక ప్రజా నాయకుడిని ఎన్నికల్లో ఎదుర్కోలేక, కేవలం రాజకీయంగా దెబ్బతీయాలనే కుటిల ఉద్దేశంతో గత ప్రభుత్వ హయంలో పగబట్టి సాగించిన కక్ష సాధింపు చర్యే 2023 సెప్టెంబర్ 9 న జరిగిన చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ అని చింతమనేని ప్రభాకర్ మండి పడ్డారు. ఆ చీకటి ఘటన జరిగి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు 'నిజం గెలిచింది' పేరిట దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా వినూత్న రీతిలో స్మారక కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే దిశానిర్దేశంలో బుధవారం సాయంత్రం సరిగ్గా 6 గంటలకు దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పరిధి లోని 53 ఆలయాలు, చర్చిలు, మసీదులలో ఏకకాలంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని 53 కొవ్వొత్తులను వెలిగించి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. 'నిజం గెలిచింది - ధర్మం నిలిచింది - ప్రజాస్వామ్యం వర్ధిల్లింది' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. దుగ్గిరాలలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నియోజకవర్గ పరిశీలకురాలు ఇందిరా ప్రియదర్శిని, దుగ్గిరాల గ్రామ కూటమి నాయకులు పాల్గొని 53 కొవ్వొత్తులను వెలిగించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పగబట్టి చేసిన అక్రమ అరెస్టుతో ఆనాడు 53 రోజులు శిక్ష అనుభవించింది చంద్రబాబు కాదని, యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నారు. చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో గడిపిన ఆ 53 రోజులు కేవలం ఆయన ఒక్కరికే పడిన శిక్ష కాదు. అత్యంత క్లిష్ట సమయంలో అనుభవజ్ఞుడైన ఒక దార్శనిక నాయకుడిని దూరం చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలు అనుభవించిన శిక్ష. ఆయన పై పెట్టిన కేసుల్లో ఏ ఒక్క దర్యాప్తు సంస్థ కూడా ఆధారాలు చూపలేకపోయింది. చివరకు న్యాయస్థానాల్లో అవి తప్పుడు కేసులుగా తేలి, కొట్టివేయబడ్డాయి. ఆయన జైలులో గడిపిన 53 రోజులు ఎంత వాస్తవమో, ఆ కేసులో ఎలాంటి వాస్తవం లేదని, నిజం గెలిచిందని అంతే స్పష్టంగా రుజువైంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# గెడ్డ ఆక్రమణ పై గంటా ఆగ్రహం.





**భీమిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 09:** జీవీఎంసీ 1 వ వార్డు పరిధి లోని బాలాజీనగర్ లో గెడ్డ ఆక్రమణల పట్ల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన అనధికారిక రోడ్డు కోసం వాడుక నీరు ప్రవహించే గెడ్డలను పూడ్చడమేమిటని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తున్న రియల్టర్ సహా స్థానికంగా కొందరు రైతులు పొలాల్లోకి వెళ్లే తోవ కోసం గెడ్డ కప్పేస్తున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఇలాంటి కార్యకలాపాలను నిలువరించాలని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఎమ్మార్వో పి.రామారావును ఆదేశించారు. వ్యర్థాలతో నిండిపోయిన బాలాజీనగర్ గెడ్డను శుభ్రం చేయాలని భీమిలి జోనల్ కమిషనర్ విజయ్ కుమార్ కు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తమ్మిన సూరిబాబు, గంటా నూకరాజు, పాసి త్రినాథ్, దండి వెంకటేష్, కురుమిన లీలావతి, గరే సదానంద, కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చినదొడ్డిగల్లు హైస్కూల్ సందర్శించిన డైట్ బృందం





**నక్కపల్లి, పెన్ సత్తా,సెప్టెంబరు 09:**మండలంలో చినదొడ్డిగల్లు హైస్కూల్ ను బుధవారం డైట్ పరిశీలకుల బృందం ఆకస్మికంగా సందర్శించారు.ముందుగా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న తీరు పరిశీలించారు.విద్యార్థులను పలుప్రశ్నలడిగి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ఉన్నతపాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులపై తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ తరగతులను ప్రధానోపాధ్యాయులు వి.బాలాజీ వారి దృష్టికి తెలియజేశారు.తెలుగు,ఇంగ్లీష్ లలో విద్యార్థులను చదివించి సామర్థ్యాలను అంచనా వేశారు.గణితం లో పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టించారు.అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.పాఠశాలలను సందర్శించినవారిలో వై.ఏ.ఆర్.కే. ప్రసాద్,ఎం.వెంకట రమణ, సి.ఆర్.పీ.శేఖర్ లు ఉన్నారు

## అమూల్య నర్సింగ్ హోమ్‌లో రూ.100 కోట్ల అక్రమాలు

ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

**పల్నాడు జిల్లా:పెన్ సత్తా,సెప్టెంబరు 09:** నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అమూల్య నర్సింగ్ హోమ్‌లో రూ.100 కోట్ల అవినీతికి పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసీలను అడ్డుపెట్టుకుని ప్రజలు, ప్రభుత్వ సొమ్మును దోచుకున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు నిర్వహించి, అదే కేసులను తిరిగి సీఎం రిలీఫ్ ఫండ్‌కు పెట్టి మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యేకు చెందిన అమూల్య నర్సింగ్ హోమ్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టారని తెలిపారు. ఎమ్మెల్యేకు ఏడుగురు పీఏలు ఇష్టారాజ్యంగా సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, ఇవన్నీ ఎమ్మెల్యేకు తెలియకుండా జరగవని అన్నారు.

ఇలాంటి స్కామ్‌లు నరసరావుపేటకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసీల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని గోపిరెడ్డి పేర్కొన్నారు. వైయస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసీలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అమూల్య నర్సింగ్ హోమ్ వ్యవహారంతో పాటు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుపై సమగ్ర దర్యాప్తు జరిపి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. ఇలాంటి ప్రజాప్రతినిధిని ఎన్నుకున్నందుకు నరసరావుపేట ప్రజలు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## పరవాడలో నిజం గెలిచింది నిరసన ప్రదర్శన.

కొవ్వొత్తులతో మద్దతు తెలిపిన టీడీపీ శ్రేణులు.



**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 09:**వైసీపీ పాలనలో టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పై నమోదు చేసిన అక్రమ కేసులు, ఆయన నిర్బంధానికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపుమేరకు మండల కేంద్రం పరవాడలో "నిజం గెలిచింది" పేరిట నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు పయిల చిన అక్కునాయుడు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పయిల సన్యాసిరావు మాస్టారు నివాసం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించారని గుర్తు చేసుకున్నారు. ఆ కష్టకాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు జాతి మొత్తం నిజం గెలవాలి అంటూ చంద్రబాబుకు వెన్నుదన్నుగా నిలిచిందని పేర్కొన్నారు. చివరకు న్యాయస్థానాల్లో అక్రమ కేసులు నిలబడలేకపోయాయని, నిజమే గెలిచి చంద్రబాబు నాయుడు నిర్బంధం నుంచి విడుదలయ్యారని హర్షం వ్యక్తం చేశారు. నాటి చీకటి రోజులను గుర్తు చేసుకుంటూ, ధర్మం తరఫున నిలిచిన తెలుగు ప్రజలందరికీ ఈ సందర్భంగా నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు మూడేళ్లు






నిజం గెలిచింది కార్యక్రమంలో పెమ్మసాని, ధూళిపాళ్ల.

**పెదకాకాని, పెన్ సత్తా, సెప్టెంబర్ 09:**న్యాయానికి సంకెళ్ళ వేసి, చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్టు చేసి మూడేళ్లు గడిచిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'నిజం గెలిచింది' కార్యక్రమాల్లో భాగంగా పొన్నూరు నియోజకవర్గ పరిధి లోని పెదకాకాని మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ ఒక చిన్న గ్రామ స్థాయి నుంచి కష్టపడి ఎదిగి ఆయనకున్న తెలివితేటలు, కష్టపడేతత్త్వం ద్వారా ఎదిగిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఒక ఐఏఎస్ గా ఎదగడానికి, మరిన్ని ఉన్నత స్థాయి అవకాశాలు ఆయనకు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం రాజకీయాల పై ఉన్న ఆసక్తి తో ఆయన ప్రజాక్షేత్రం లోకి, ప్రజాసేవ లోకి అడుగు పెట్టారన్నారు. అలాంటి చంద్రబాబు కి పెద్ద పెద్ద భవనాల్లో, పెద్ద పెద్ద అంతస్తుల్లో ఉండాలన్న కోరిక కూడా ఉండదు.

పాత తరం డ్రస్సును, పాత తరపు సఫారీ వాహనాన్ని, మితంగా తీసుకునే ఆహారంతో సాదాసీదా జీవితం గడిపే వ్యక్తి, నాయకులు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఎంతటి నాయకు లైనా మంచి బట్టలు వేసుకోవాలని, వారం చివరలో కుటుంబంతో గడపాలని అనుకుంటారు కానీ, వీటన్నింటినీ దూరంగా పెట్టి, వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి, కేవలం ప్రజల కోసమే జీవిస్తున్న ఏకైక నాయకులు మన చంద్రబాబు నాయుడు. విమానాల్లో ప్రయాణిస్తున్న సరే, ఢిల్లీ లో మమ్మల్ని కలుసుకున్నప్పుడైనా సరే సరదా కోసం అయినా కొన్ని నిమిషాలు కూడా టైం వేస్ట్ చేయరు. ప్రతి నిమిషం ఆంధ్ర ప్రదేశ్ కు ఏ కంపెనీలు తీసుకు రాగలం, ఏ విధంగా పెట్టుబడులు తీసుకు రాగలము, మన తెలుగు ప్రజల కోసం ఏం చేయాలి ఏం చేయగలం అంటూ నిరంతరం ఆలోచిస్తూ ఉంటారన్నారు. ఇలాంటి తరుణంలో రాజశేఖర్ రెడ్డి తనయుడిగా రాష్ట్రాన్ని పాలిస్తాడని, ఒక్క ఛాన్స్ అని అడిగితే నమ్మి అవకాశం ఇచ్చిన పాపానికి ప్రజలను ముప్పు తిప్పలు పెట్టారు. ఐదేళ్లలో ఒక కంపెనీ తేవడం చేతకాక, ఒక ప్రాజెక్టు నిర్మించడం చేతకాక ప్రజా వేదిక మొదలు, అమరావతి విధ్వంసం, ప్రజల్ని ఇబ్బంది పెట్టడం మొదలు మహిళలని బూటు కాళ్లతో తన్నించడం వరకు ఒక అరాచక పాలనను సృష్టించారు. కానీ చంద్రబాబు నాయుడు వచ్చిన రెండున్నరేళ్లలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయింది, పోలవరం పూర్తి కాబోతోంది, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐటీ శిఖరాగ్ర సంస్థలు మన రాష్ట్రానికి రావడం, వేల కోట్లది నిధులు తీసుకురావడం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు మన రాష్ట్రానికి వచ్చాయన్నారు. అన్న నందమూరి తారక రామారావు ఆత్మ గౌరవ నినాదం నుంచి పుట్టిన తెలుగుదేశం పార్టీ ఏ రోజు, ఎవరికీ తలవంచదు. 53 రోజులపాటు చంద్రబాబు ని 30 రోజులకు పైగా ధూళిపాళ్ళ నరేంద్ర ని జైల్లో పెట్టిన అంత మాత్రాన జగన్ సాధించింది ఏమీ లేదు. రక్తం మరిగిన మా కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్లి మన రాష్ట్రాన్ని తిరిగి తెలుగుదేశం పార్టీ చేతికి అందించారు. సోషల్ మీడియాలో ఒక 300 మందిని నియమించుకొని, ఒక్కొక్కరికి జీతాలు ఇస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పై విషం కక్కడం తప్ప జగన్ మోహన రెడ్డి చేయగలిగేది ఏమీ లేదన్నారు. ఈ రోజున ఎంత అభివృద్ధి జరుగుతున్నా సరే, బురద చల్లే ఆరోపణలు చేసినంత మాత్రాన ప్రభుత్వంలో స్కామ్ లు జరిగాయని కాదన్నారు. జగన్ అక్రమంగా విక్రయించిన లిక్కర్స్ స్కాం ను, ఇసుక దోపిడిని, మైనింగ్ దోపిడీని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలన నుంచి కాపాడి, సుభిక్ష పాలనను అందజేస్తున్న చంద్రబాబు పనితీరును చూస్తుంటే మాలాంటి వారు ఎందరో నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఇలాంటి పాలన రాబోయే 10 - 15 ఏళ్లపాటు కొనసాగితే రాష్ట్రం దేశం లోనే అత్యున్నత రాష్ట్రముగా నిలబడుతుంది అనడంలో అతిశయోక్తి లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే ధూళిపాళ్ల మాట్లాడుతూ మూడేళ్ల క్రితం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు జరిగిన దుర్ఘటనను నిరసిస్తూ నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు నిరసన ప్రదర్శిస్తే అప్పటి పోలీసులు ప్రజానీకాన్ని అడ్డుకున్నారు అన్నది అందరికీ తెలిసిందే. వైసిపి అక్రమ పాలన జరుగుతున్న రోజుల్లో పోలీస్ యంత్రాంగాన్ని అడ్డ దిడ్డంగా ప్రయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు.

అక్రమ అరెస్ట్ ను అడ్డు కోబోయిన మహిళలను, వృద్ధులను లాఠీలతో కొట్టి హింసించారు, ఆరోజు నిజంగా ఒక చీకటి రోజు అన్నారు. తిరిగి అదే జగన్ మోహన్ రెడ్డి ఇవాళ తప్పుడు పనులు చేసిన వైసీపీ నాయకుల పై చర్యలు తీసుకుంటూ ఉంటే మాత్రం పోలీసుల దుర్మార్గ ప్రవర్తనలంటూ మాట్లాడటం జగన్ అక్రమ, అరాచక పాలనకు పరాకాష్ట అని స్పష్టమవుతుందన్నారు. ఆరోజు జగన్ మోహన్ రెడ్డి వ్యవహరించిన తీరు లక్షలాది మంది తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల గుండెల్లో కనపడని గాయాలు చేసింది.

ప్రజలు చంద్రబాబు అక్రమ అరెస్ట్ ని నిరసిస్తూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు గొంతు ఎత్తి ప్రశ్నించడం చంద్రబాబు సుభిక్ష పాలనకు అద్దం పడుతుందన్నారు. ఆరోజు ప్రజలు చూపిన చొరవ, ప్రశ్నించిన తీరు చంద్రబాబు ప్రజాపాలనను ప్రజలు కోరుకుంటున్నారు అనడానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రెసిడెంట్ వలివేటి మురళికృష్ణ, ఎంపీపీ శిరీషా, జనసేన నాయకులు ఆళ్ల హరి, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, తదితర మండల, గ్రామ స్థాయి కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ టీడీపీ కేంద్ర కమిటీ ప్రమాణ స్వీకారం.







కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని.

**మంగళగిరి, పెన్ సత్తా, సెప్టెంబర్ 09:**నూతనంగా ఎన్నికైన ఎన్ఆర్ఐ టీడీపీ కేంద్ర కమిటీ విభాగానికి చెందిన 45 సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళగిరి లోని టిడిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో తెలుగువారు లేని దేశాలు లేవు అంటే అతిశయోక్తి కాదని, అది తెలుగు జాతి గొప్పతనం అన్నారు. తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన అన్న నందమూరి తారక రామారావు ఆలోచనలు, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లే బాధ్యత మన అందరి పై ఉందన్నారు.

విద్యావంతులు, వైద్యులు, అడ్వకేట్లు వంటి వారికి టిక్కెట్లు ఇచ్చి అసెంబ్లీకి నడిపించిన ఘనత అన్న నందమూరి తారక రామారావు ది అయితే, 1999 లో 119 మంది విద్యావంతులకు టిక్కెట్లు ఇచ్చి అసెంబ్లీకి నడిపించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కే దక్కుతుందన్నారు. అలాగే ఇప్పుడు ఎందరో ఎన్నారైలకు కూడా ప్రజా ప్రతినిధులుగా టిడిపి అవకాశం కల్పించిందన్నారు. అందులో భాగంగానే పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిచి, హెచ్ఎంఓఎస్ గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని, అక్రమ పాలనను సోషల్ మీడియా వేదికగా కడిగిపారేసింది మన ఎన్ఆర్ఐ లు అన్నారు. జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్టు చేస్తే 55 దేశాలలో మన ఎన్నారైలు గొంతెత్తి ప్రశ్నించారు, నిలదీశారన్నారు. కొంత మంది కొన్ని వేల డాలర్ల సొంత డబ్బును ఖర్చు పెట్టుకుని ఎన్నారైలు వేలాదిగా తరలివచ్చి 2024 ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. అందుకే మిమ్మల్ని ఎన్ఆర్ఐ లుగా కాదు, ఏంఆర్ఐ - మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్ గా నేను గుర్తుంచుకుంటాను అని లోకేష్ అన్నారు. మన ఎన్ఆర్ఐ లు దేశాన్ని వదిలి వెళ్ళినా సరే, తెలుగుదనాన్ని, తెలుగు సంప్రదాయాన్ని మర్చిపోలేదు. మీ పిల్లలను తెలుగు భాషను మరవనివ్వలేదు. ఇది నిజంగా అభినందనీయం అని ప్రశంసించారు.

అలాంటి ఎన్ఆర్ఐ లకు సహాయ సహకారాలు అందించడానికి టీడీపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

ఇటీవల జరిగిన యుద్ధాల్లో గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా వెనక్కు తీసుకొచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. మీరందరూ తెలుగుదేశం బ్రాండ్ అంబాసిడర్లు. మనందరి నినాదం తెలుగు రాష్ట్రాన్ని నెంబర్ - 1 స్థానంలో నిలబెట్టడమే.

కార్యకర్తలు చేస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని మై టీడీపి యాప్ లో అప్లోడ్ చేయండి.

గురు రాజా గారి పై ఇక నుంచి బాధ్యత పెరిగింది. ప్రతీ 10 మంది ఎన్ఆర్ఐ ల సమూహంలో ఒక టిడిపి ఎన్ఆర్ఐ సభ్యుడు ఉండేలా మనం పని చేయాలి.

సరిగ్గా మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్మెంట్ అవినీతి పేరుతో తెల్లవారుజామున మూడు గంటలకు నారా చంద్రబాబు నాయుడు ని గత ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది. తొలుత రూ. 300 కోట్లు అవినీతి అన్నారు, తరవాత రూ. 100 కోట్లు అన్నారు, చివరితో రూ. 30 కోట్లు అన్నారు ఒక్క రూపాయి అవినీతి కూడా చూపించ లేకపోయారు. ప్రజలతో నేను చంద్రబాబు నాయుడు ని కలవడానికి తొలిసారి రాజమండ్రి జైలుకు వెళ్ళినప్పుడు, అక్కడ చంద్రబాబు చేత నిర్మింప చేసిన భవనాలు, ఇతర నిర్మాణాల శంకుస్థాపనల ఫలకాలను చూసి నిజంగా చాలా బాధనిపించింది.

ఆరోజు ప్రతి కార్యకర్త అండగా నిలబడ్డారు. పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు. కష్ట కాలంలో నిలబడ్డ ఏ కార్యకర్తను కూడా తెలుగుదేశం పార్టీ మరిచిపోదు అని లోకేష్ అన్నారు.

చంద్రబాబు నాయుడు ఏ రోజు తప్పు చేయలేదు అదే ఆయనకు, మా కుటుంబానికి అండగా, శ్రీరామరక్షగా నిలబడింది అని లోకేష్ తెలిపారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ

దూరం పెరిగినా.. దేశ భక్తి వదలని,

దేశం మారినా.. తెలుగుదేశం జెండా వదలని ఎన్ఆర్ఐ సోదర, సోదరీమణులకు నా నమస్కారాలు అంటూ ప్రారంభించారు. సంపాదనను కూడా పక్కనపెట్టి, పార్టీనే ముఖ్యమని నమ్మి టిడిపి అభ్యున్నతికి కృషిచేసిన గురురాజా కి ఇది ఒక సముచిత స్థానం. అమెరికాకు అందరి కంటే ముందుగా వెళ్లి, అమెరికాకు వెళ్లిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటూ ఎన్ఆర్ఐ అంటే ఆయనే అంటూ గౌరవం అందుకుంటున్న కోమటి జయరాం కి, టిడిపి కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఈరోజు ఈ కార్యక్రమం ఒక ప్రమాణ స్వీకార కార్యక్రమంలా కాక పండుగ వాతావరణంలో జరగడం నిజంగా అభినందనీయం.

ముఖ్యమంత్రిగా ఎంత మంది నాయకులు మారినా సరే సాంకేతికతను ప్రోత్సహిస్తూ ఇంజనీరింగ్ కాలేజీలను పెంచుతూ, ఐటీ విభాగానికి ప్రత్యేక స్థానం కల్పించిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అలాంటి నాయకుడిని మన తెలుగు చరిత్ర ఎప్పటికీ మర్చిపోకూడదు.

2024 ఎన్నికల్లో ఎన్ఆర్ఐ లు పోషించిన పాత్ర అనిర్వచనీయం. దొంగ ఓట్లు గుర్తించడం గాని, ప్రచార బాధ్యతలు చేపట్టడం గానీ, గడప గడపకు తెలుగుదేశం ఉద్దేశాలను లక్ష్యాలను తీసుకెళ్లడంలో గాని ఎన్నారై సోదర సోదరీమణులు తీసుకున్న చొరవ, చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిది. అలాంటి ఎన్ఆర్ఐ లను మరిచిపోకుండా ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత మన టిడిపి పార్టీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఏడుగురు ఎన్నారై లకు ప్రజా ప్రతినిధులుగా స్థానం కల్పించింది.

టీటీడీ బోర్డు మెంబర్ గా అలాగే అక్కడ సౌకర్యాలలో కూడా ప్రత్యేక స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నారై టిడిపి కేంద్ర కమిటీ విభాగ సభ్యులు విదేశాల్లో ఉన్నటువంటి మన ఎన్ఆర్ఐ సోదరులందరితో సత్సంబంధాలను ఏర్పరుచుకోవాలి.


గడిచిన 5 ఏళ్లలో ఎన్నారైలు పనిచేసిన తీరు ఒక ఎత్తు అయితే, ఇపుడు చేయాల్సిన బాధ్యత మరో ఎత్తు అని పెమ్మసాని సూచించారు.


గురు రాజా మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ నాయకత్వంతో మొదలైన నా అభిమానం అమెరికాకు వెళ్లినా సరే నా అనుబంధం నా తెలుగు నేలతోనే ముడిపడి ఉందన్నారు. అందుకని ఈరోజు నేను స్వీకరిస్తున్నది పదవి మాత్రమే కాదు, ప్రవాస ఆంధ్రుల ఆలోచనలను మోసుకు రాగల మహత్తర బాధ్యత అన్నారు. యువగళం కార్యక్రమంలో పాదయాత్రకు వెళ్తున్న నారా లోకేష్ కి తిలకం దిద్దుతూ మేము శిల గా అడుగు పెడుతున్న లోకేష్ శిల్పంలా మారి రావాలని కోరుకున్నాము.

కార్యక్రమంలో లోకేష్ మామూలు శిలగా కాదు నారా - నందమూరి రక్తంతో తయారైన అద్భుత మైన శిల గా రూపు దిద్దుకున్నారు. తెలుగుదేశం పార్టీ విజయమే తెలుగు రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్షగా మనం ఎప్పటికప్పుడు తెలుగుదేశాన్ని తీర్చిదిద్దుకుంటూ, గెలిపించుకోవాలిని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచు వేణుగోపాల్ రెడ్డి సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పి, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ ప్రెసిడెంట్ గురు రాజా, వైస్ ప్రెసిడెంట్ కోమటి జయరాం, కమిటీ సభ్యులు, ఏపీ ఎన్ఆర్టి ప్రెసిడెంట్ వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా డిజిటల్ కేసీసీ రుణాలు.





* కేవలం 10 నిమిషాల్లో రైతులకు రుణాల పంపిణీ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 09**: రైతులకు వేగంగా, పారదర్శకంగా రుణాలు అందించేందుకు అనకాపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద డిజిటల్ "కిసాన్ క్రెడిట్ కార్డ్" (కేసీసీ) రుణాల పంపిణీ ప్రక్రియను బుధవారం ఉదయం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ 'అగ్రిస్టాక్' భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఈ డిజిటల్ విధానం ద్వారా అర్హులైన రైతులకు దరఖాస్తు చేసుకున్న కేవలం 10 నిమిషాల్లోనే నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో రుణం మొత్తం జమ కానుందని తెలిపారు. జిల్లాలో దాదాపు 3 లక్షల మంది రైతుల డేటాను పరిశీలించి, అగ్రిస్టాక్ ఫిల్టరేషన్ ద్వారా ప్రాథమికంగా 80,000 మంది రైతులను కేసీసీ రుణాలకు అర్హులుగా ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. ఎస్బిఐ, యుబిఐ వంటి జాతీయాకృత బ్యాంకుల ప్రతి శాఖకు కనీసం 100 మంది రైతులకు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని, మండలాల వారీగా, బ్రాంచ్‌ల వారీగా లక్ష్యాలను కేటాయించడం జరిగిందని చెప్పారు. ఈ రుణ ప్రక్రియలో ఎటువంటి మానవ జోక్యం ఉండదని చెప్పారు. దరఖాస్తు ఆన్‌బోర్డ్ అయిన వెంటనే సిస్టమ్ ఆధారితంగా రుణం ఆమోదం పొంది 10 నిమిషాల్లో ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు, రుణ వితరణ అధికారులు సమావేశాలు నిర్వహించాలని, డిజిటల్ విధానంలో దరఖాస్తు ఎలా చేసుకోవాలో రైతులకు డెమో ద్వారా ప్రత్యక్షంగా వివరించాలని చెప్పారు. ప్రస్తుత వర్షాభావం, ఎల్-నినో పరిస్థితుల ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ, ప్రాజెక్టుల ద్వారా గోదావరి నీటిని జిల్లాకు తీసుకురావడం జరిగిందన్నారు. రాబోయే 90 రోజులకు సాగు నీటి కొరత లేకుండా చూస్తూ, రైతులకు ఆర్థికంగా చేదోడుగా నిలిచేందుకు ఈ రుణ వితరణ తోడ్పడుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు వినియోగించుకునేలా బ్యాంకింగ్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో పని చేయాలని ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రైతు డిజిటల్ రిజిస్టర్ నందు రైతుల భూమి రికార్డులు, సాగు చేసే పంటల సమాచారం, యజమానత్వ హక్కులు అనుసంధానించబడి ఉంటాయని, జన్ సమర్థ్ పోర్టల్ ఇప్పటికే ఉన్న రూఫ్ టాప్ సోలార్, ముద్రా, స్టార్టప్ పథకాలతో పాటు, ఇప్పుడు కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) రుణాలను కూడా డిజిటల్ ప్రక్రియ ద్వారా అందించడానికి ఈ పోర్టల్ అందుబాటు లోకి తెచ్చామని చెప్పారు. ఆన్‌లైన్ పట్టా రికార్డుల ద్వారా భూమి పై ఏవైనా లోన్ ఛార్జీలు, లీన్ లేదా తాకట్టు వివరాలు ఉన్నాయా అనేది తనిఖీ చేస్తారని, రైతు ఆధార్ నంబర్ ఆధారంగా వడ్డీ రాయితీ, సకాలంలో రుణం తిరిగి చెల్లించిన చరిత్రను తనిఖీ చేస్తారని చెప్పారు. డబుల్ ఫైనాన్సింగ్ (ఒకే భూమి పై మళ్లీ రుణం పొందడం) జరగకుండా చూడటానికి బ్యాంక్ ఇ-కేవైసీ, సి-బిల్ స్కోర్, మొండి బాకీలు మరియు రైట్-ఆఫ్ వివరాలను పరిశీలిస్తారని వివరించారు. రైతు మొబైల్ నంబర్ ఉపయోగించి జన్ సమర్థ్ పోర్టల్‌లో ఖాతా సృష్టించాలని, ఈ సమాచారాన్ని పోర్టల్ బ్యాంకర్లతో పంచుకోవడానికి డిజిటల్ సమ్మతి తెలియజేసి వారి ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ని నమోదు చేయాలని, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) రుణం ఎంచుకోవడంతో ఆటోమేటిక్ బ్యాక్‌గ్రౌండ్ పరిశీలనలు జరిగి బ్యాంక్ ప్రాసెసింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు.

కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) పంట రుణ డిజిటల్ అప్లికేషన్, ఆన్ బోర్డింగ్ విధానంలో దరఖాస్తుదారులు ఓటీపీ ద్వారా లాగిన్ అయి, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) పంట రుణం (క్రాప్ లోన్) పథకాన్ని , తమ రాష్ట్రం, జిల్లా వివరాలను రైతు ఎంచుకుంటారని తెలిపారు. నమోదు చేసుకున్న మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా ఆధార్ సంఖ్యను ఉపయోగించి రైతు గుర్తింపును ధృవీకరిస్తారు. రైతు వివరాలు కేంద్ర/రాష్ట్ర రైతు డేటాబేస్‌లో నమోదయ్యాయో లేదో, "ఆమోదించ బడ్డాయో" లేదో సిస్టమ్ తనిఖీ చేసిన తదుపరి నకిలీ లేదా బహుళ రుణాలను నివారించడానికి పొలం జియో- కోఆర్డినేట్స్ పాత కేసీసీ/కేఆర్పి రుణాలు, భూమి బకాయిల వివరాలను క్రాస్ చెక్ చేస్తారు. రైతు తమ బ్యాంక్ ఖాతా వివరాలను అందిస్తారు. ఖాతాలో కేవైసి యాక్టివ్‌గా ఉందో లేదో, యుడిఐ/యూపీఐ మ్యాపింగ్ సరిగ్గా ఉందో లేదో, బ్యాంక్ నిబంధనల ప్రకారం అర్హత ఉందో లేదో సిస్టమ్ నిర్ధారిస్తుంది. తర్వాత, రైతు భూమి రికార్డులను సేకరించి, ఆ భూమి విస్తీర్ణం, పంట ఆధారంగా తుది రుణ మొత్తాన్ని నిర్ణయిస్తారు. అగ్రికల్చర్ శాఖ, బ్యాంక్ మేనేజర్లు, ఢిల్లీ నుండి వచ్చిన సెంట్రల్ టీమ్ సమన్వయంతో రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్కె) వద్ద రైతులతో సమావేశాలు నిర్వహించి ఈ రుణాల ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆశా దేవి, సెంట్రల్ టీమ్ అధికారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం






* పోషణ మాసోత్సవం ప్రారంభం
* అంగన్వాడి సూపర్వైజర్ సోఫియా

**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 09:** పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్.కె సోఫియా అన్నారు. బుధవారం కాగిత అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు.

వీరి పట్ల అంగన్వాడి కేంద్రాలలో ఉన్న కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరికి పోషక ఆహారంపై అవగాహన కల్పించే బాధ్యత అంగన్వాడి కార్యకర్తలు దేని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందిస్తుందని ఆమె తెలిపారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, సిహెచ్ సత్యవతి, కాగిత ఎమ్ ఎల్ హెచ్ పి ప్రశాంతి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వేంపాడు సెక్టర్ అంగన్వాడి కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం

రాజకీయ కుయుక్తులు, పోలీసు ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొందాం
వైయస్ఆర్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రామభూపాల్‌రెడ్డి



**బనగానపల్లె: పెన్ సత్తా, సెప్టెంబర్ 09:** రాబోయే ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని వైయస్ఆర్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రామభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బనగానపల్లె జీఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

40 ఏళ్ల రాజకీయ అనుభవంతో చెబుతున్నానని, రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కాటసాని రామభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ చేసే రాజకీయ కుయుక్తులు, ప్రలోభాలతో పాటు పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని వైయస్ఆర్‌సీపీ శ్రేణులపై చేసే ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని, అవసరమైతే న్యాయపరంగానూ పోరాడాలని సూచించారు.

దివంగత మహానేత వైయస్ఆర్ రాయలసీమ అభివృద్ధి, సాగునీటి కోసం జీవితాంతం పోరాడారని, గోరకల్లు, హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని గుర్తుచేశారు. రాయలసీమకు నీరు అందించేందుకు వైయస్ఆర్ చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పేర్కొంటూ.. నేడు రాయలసీమ ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్న టీడీపీ నాయకులు గతంలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని సూచించారు. ప్రజలే బలం.. కార్యకర్తలే బలమని, ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని కాటసాని రామభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామం, ప్రతి వార్డులో వైయస్ఆర్‌సీపీని బలోపేతం చేసి, ఐక్యంగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కాటసాని తిరుపాలురెడ్డి, భూమా కిషోర్‌రెడ్డి, కాటసాని ప్రసాద్‌రెడ్డి, మైనారిటీ నాయకులు, సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయాలి

నక్కపల్లి లో ఇన్‌స్పైర్ మానక్‌పై ఉపాధ్యాయులకు అవగాహన




**నక్కపల్లి, పెన్ సత్తా సెప్టెంబర్ 09:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇన్స్పైర్ మానక్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి జి.ఎస్ నాగేశ్వరరావు అన్నారు. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, యలమంచిలి, పాయకరావుపేట మండలాలకు చెందిన మొత్తం 56 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి జి.ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ మానక్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, ఉపాధ్యాయులు విద్యార్థులను ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

జడ్.పి.హెచ్.ఎస్ నక్కపల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి, జిల్లా సైన్స్ అధికారి డి. కాలిదాస్, రిసోర్స్ పర్సన్స్ బి.ఎన్. మూర్తి, వి. సుజాత, సంపత్ పాల్గొని కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

రిసోర్స్ పర్సన్స్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ చుట్టూ ఉన్న రోజువారీ జీవిత సమస్యలను గుర్తించి, వాటికి వినూత్నమైన మరియు ఆచరణాత్మక పరిష్కారాలను ఆలోచించేలా ఉపాధ్యాయులు మార్గ నిర్దేశం చేయాలని తెలిపారు. అలాగే ఇన్‌స్పైర్ మానక్‌లో విద్యార్థులు ఎలా పాల్గొనాలి, వినూత్న ఆలోచనలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా అభివృద్ధి చేసి సమర్పించాలి అనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కేవలం ప్రాజెక్టులను తయారు చేయడమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు రూపొందించే దిశగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐదు మండలాల నుంచి 56 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్కామ్‌ల్లో చంద్రబాబు నంబర్ వన్




**తాడేపల్లి:** స్కిల్ స్కామ్ నుంచి డీఎస్సీ వరకు అవినీతి, అక్రమాలపై ప్రజలకు సమాధానం చెప్పకుండా సంబరాలు చేసుకోవడం చంద్రబాబు, లోకేశ్‌కు పరిపాటిగా మారిందని వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర ధ్వజమెత్తారు. స్కిల్ ప్రాజెక్టులో విడుదలైన రూ.371 కోట్లకు లెక్క చెప్పకుండా, ఈడీ జప్తు చేసిన రూ.54.74 కోట్ల ఆస్తులపై వివరణ ఇవ్వకుండా, పాత చార్జ్‌షీట్‌లను పక్కనపెట్టి కొత్త నివేదికలతో కేసులను తుడిచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేసుల స్వరూపాన్ని మార్చినా ప్రజల కళ్లకు గంతలు కట్టలేరని తేల్చి చెప్పారు. స్కామ్‌ల్లో చంద్రబాబు నెంబర్ వన్ కాగా, ఆయన కుమారుడు నారా లోకేష్ కూడా అదే బాటలో నడుస్తున్నారని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వంగవీటి నరేంద్ర స్పష్టం చేశారు.

**ప్రెస్‌మీట్‌లో వంగవీటి నరేంద్ర ఏమన్నారంటే..:**

-- క్యాండిల్ ర్యాలీలు కాదు.. రూ.371 కోట్లకు లెక్క చెప్పాలి:

చంద్రబాబు స్కిల్ స్కామ్ కేసులో అరెస్టయి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటు. ఏదో దేశం కోసం త్యాగం చేసిన నాయకుడికి నివాళులు అర్పించినట్లు 53 దేశాల్లో క్యాండిల్ ర్యాలీలు చేస్తున్నామని ఆయన కుమారుడు లోకేశ్ చెప్పుకుంటున్నారు. అసలు ముందు స్కిల్ ప్రాజెక్టులో ప్రభుత్వం విడుదల చేసిన రూ.371 కోట్లకు లెక్క చెప్పండి. రూ.3,300 కోట్ల ప్రాజెక్టులో రూ.371 కోట్లు ఎందుకు విడుదల చేశారు? అందులో దాదాపు రూ.243 కోట్లు స్కిల్లర్ సంస్థకు ఎలా చేరాయి? ప్రైవేట్ సంస్థ పెట్టుబడి పెట్టకుండానే ప్రభుత్వ నిధులను ఎందుకు విడుదల చేశారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఏటా అరెస్టు వార్షికోత్సవాలు చేసుకోవడం ఎందుకు?"

**రూ.54.74 కోట్ల ఆస్తుల జప్తుపై సమాధానం ఏంటి?:**

డిజైన్‌టెక్‌కు సంబంధించిన రూ.31.2 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ జప్తు చేసింది. ఆ తర్వాత ఢిల్లీ, ఎన్‌సీఆర్, ముంబై, పుణేలో బ్యాంకు బ్యాలెన్సులు, షేర్లు, స్థిరాస్తుల్లో మరో రూ.23.54 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. అంటే మొత్తం రూ.54.74 కోట్ల ఆస్తులను ఈడీ ఎందుకు జప్తు చేసింది? టీడీపీ ఖాతాలోకి వెళ్లిన రూ.27 కోట్లను ఎందుకు వెనక్కి తీసుకొచ్చారు? షెల్ కంపెనీల ద్వారా నిధులు ఎందుకు మళ్లాయి? బోగస్ బిల్లులు ఎవరు తయారు చేశారు? ఎవరు ఆమోదించారు? ఎంట్రీ ఆపరేటర్ల వ్యవహారం, నలుగురి అరెస్టులు, విదేశీ సంస్థలకు నిధులు చేరిన అంశాలపై సమాధానం చెప్పాలి. క్లీన్‌చిట్ వచ్చిందని చెబుతున్న లోకేశ్.. ఆ లేఖను ప్రజల ముందు పెట్టే ధైర్యం ఉందా?.

**పాత చార్జ్‌షీట్.. కొత్త తుది నివేదిక ఎక్కడ?:**

2014--19 మధ్య నమోదైన స్కిల్, ఫైబర్‌నెట్, మద్యం, ఇన్నర్ రింగ్ రోడ్ కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు, చార్జ్‌షీట్లు, ఆడిట్ నివేదికలు, వాంగ్మూలాలు ఉన్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధారాలు లేవంటున్నారు. పాత చార్జ్‌షీట్‌లో ఉన్న అంశాలు తప్పయితే, కొత్తగా ఏ ఆధారాలతో వాటిని 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా మార్చారో చెప్పాలి. పాత చార్జ్‌షీట్, కొత్త తుది నివేదికను ఒకేసారి ప్రజల ముందు పెట్టగలరా? ప్రభుత్వం మారిన తర్వాత వరుసగా కేసుల దర్యాప్తు తీరులో మార్పులు ఎందుకు వచ్చాయి? కేసులో ఉన్న వ్యక్తే దర్యాప్తు వ్యవస్థలకు అధిపతిగా ఉండి నిష్పక్షపాత విచారణ జరిగిందని ఎలా చెప్పగలరు?"

**ఆ వాంగ్మూలం తప్పని ఎలా నిర్ధారించారు?:**

న్యాయమూర్తి ముందు సెక్షన్ 164 కింద ఇచ్చిన వాంగ్మూలం తప్పని ఎలా నిర్ధారించారు? అధికారులు మాట మార్చారని చెబుతున్నప్పుడు పాత, కొత్త వాంగ్మూలాలను ఎందుకు బయటపెట్టడం లేదు? ఆ వాంగ్మూలం మార్చడానికి వచ్చిన కొత్త ఆధారం ఏంటి? మద్యం కేసులో 2015లో జారీ చేసిన జీవో నెం:216, 217కు క్యాబినెట్ అనుమతి ఉందా? ప్రివిలేజ్ ఫీజు తొలగించడానికి ఆర్థిక శాఖ ఆమోదం ఉందా? ఎంపిక చేసిన మద్యం కంపెనీలకే అధిక ఆర్డర్లు ఎందుకు ఇచ్చారు? దాదాపు రూ.25 వేల కోట్ల ఆదాయ ప్రభావంపై నమోదైన అంశాలకు సమాధానం ఏంటి?.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ భారీగా విరాళాలు వచ్చాయి. కాంగ్రెస్?తో పోలిస్తే భారీగానే వ్యత్యాసం కనిపించింది. బీజేపీ కేంద్ర కార్యాలయానికి మాత్రమే దాదాపు రూ.1,473 కోట్లు నిధులు వచ్చాయి. కానీ కాంగ్రెస్?కు మాత్రం కేంద్ర, రాష్ట్ర విభాగాలన్నింటినీ కలిపి వచ్చిన ఆదాయం రూ.207 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే బీజేపీకి వచ్చిన మొత్తం నిధులు కాంగ్రెస్ కంటే ఏడు రేట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇరు పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల్లో ఈ వివరాలు వెల్లడించారు.



### బీజేపీ ఖాతాలో రూ.1,472.8 కోట్లు

ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మార్చి 15 నుంచి మే 6 వరకు బీజేపీ కేంద్ర కార్యాలయానికి రూ.1472.8 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఈసీకి సమర్పించిన వివరాల్లో వెల్లడైంది. అయితే కేరళ, బంగాల్ ఎన్నికలకు సంబంధించిన బీజేపీ ఖర్చుల నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. ఆయా రాష్ట్రాల వివారలు కూడా కలిపితే పార్టీ మొత్తం ఆదాయం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ప్రారంభంలో మార్చి 15న బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాల్లో సుమారు రూ.6,722.6 కోట్లు ఉన్నాయి. మే 6 నాటికి ఆ మొత్తం రూ.7,627.2 కోట్లకు చేరింది. అంటే ఎన్నికల వ్యవధిలోనే కేంద్ర కార్యాలయ నిధుల్లో రూ.904.6 కోట్ల పెరుగుదల నమోదైంది.

### కాంగ్రెస్ నిధుల్లో తగ్గుదల

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మాత్రం ఎన్నికల సమయంలో ఆర్థిక పరిస్థితి భిన్నంగా కనిపించింది. ఐదు రాష్ట్రాల పార్టీ విభాగాలు, కేంద్ర కార్యాలయాన్ని కలిపి ఎన్నికల ప్రారంభంలో సుమారు రూ.169.06 కోట్లు ఉన్నాయి. ఇందులో రూ.22.9 కోట్లు నగదు రూపంలో, రూ.146.1 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్నాయి. ఎన్నికలు ముగిసే సమయానికి ఈ మొత్తం సుమారు రూ.103.2 కోట్లకు తగ్గింది. అంటే ఎన్నికల కాలంలో కాంగ్రెస్ నిధుల్లో దాదాపు రూ.65.86 కోట్ల క్షీణత నమోదైంది.

### బీజేపీ ఖర్చు ఎక్కడెంత?

ఇప్పటివరకు బహిర్గతమైన బీజేపీ వ్యయ వివరాల ప్రకారం, అసోం, తమిళనాడు, పుదుచ్చేరిల్లో సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, మిగిలిన మొత్తం అభ్యర్థులు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించింది. అసోంలో బీజేపీ అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.76.73 కోట్లు పార్టీ సాధారణ ప్రచారానికి, రూ.19.54 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చయ్యాయి. సాధారణ ప్రచార వ్యయంలో ప్రకటనలకు దాదాపు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.27.3 కోట్లు ఖర్చయ్యాయి. ఇక తమిళనాడులో బీజేపీ రూ.51.56 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.44.51 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.7.05 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించింది. మీడియా ప్రకటనలకు సుమారు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.10.04 కోట్లు ఖర్చు చేసింది. ప్రచార సామగ్రికి మరో రూ.5.85 కోట్ల వరకు వెచ్చించింది. పుదుచ్చేరిలో బీజేపీ మొత్తం రూ.11.90 కోట్ల ఎన్నికల వ్యయాన్ని చూపించింది. ఇందులో రూ.9.19 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.2.71 కోట్లు అభ్యర్థులకు సంబంధించిన ఖర్చులకు వెళ్లాయి.

### కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు రూ.248.55 కోట్లు

ఇక కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో కలిపి రూ.248.55 కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేసింది. ఇందులో రూ.143 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, రూ.105.55 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చు చేసింది. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారానికి రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా, రాష్ట్ర, స్థానిక విభాగాలు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి. ఈ వ్యయంలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ సాధారణ ప్రచారానికి రూ.59.28 కోట్లు ఖర్చు చేసింది. అసోంలో రూ.22.62 కోట్ల వ్యయం నమోదైంది.

# భారత్, రష్యా రక్షణ ఒప్పందం

భారత్- రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. దిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్. ఈ రక్షణ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఆసియా ఖండంలో భారత్ రక్షణ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.



### ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ

మిలిటరీ-టెక్నికల్ సహకారమే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగనున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి ప్రధాన అంశం. ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ. శత్రు దేశాల నుంచి దూసుకొచ్చే విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిస్సైళ్లను గాలిలోనే పసిగట్టి నిర్వీర్యం చేయగల శక్తివంతమైన వ్యవస్థ ఇది. 2018లో రష్యాతో భారత్ 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు వ్యవస్థలను కొనుగోలు చేయగా, ఇప్పటికే మూడు భారత్‌కు చేరాయి. భారత వాయు రక్షణలో కీలకమైన ఈ ఎస్-400 సిస్టమ్స్ తదుపరి రెండు యూనిట్లను 2026 నాటికి పూర్తి స్థాయిలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని రష్యా తాజాగా ప్రకటించింది. రక్షణ కొనుగోళ్ల మండలి కూడా అదనపు వ్యవస్థల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ డెలివరీలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

### 'సుఖోయ్-57' స్టెల్త్ ఫైటర్ జెట్

ఇక ఈ భేటీలో అత్యంత వ్యూహాత్మకమైన, ఆసక్తికరమైన అంశం, రష్యాకు చెందిన ఐదో తరం 'సుఖోయ్-57' (రాబ-57) స్టెల్త్ ఫైటర్ జెట్. శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించగల ఈ అధునాతన యుద్ధ విమానాన్ని భారత్‌కు విక్రయించేందుకు రష్యా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వ్యూహం ఇక్కడ భిన్నంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా కేవలం కొనుగోలు దారుడిగా మిగిలిపోకుండా, టెక్నాలజీ బదిలీ జరగాలని భారత్ పట్టుబడుతోంది. ఆధునిక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, సెన్సార్ ఇంటిగ్రేషన్ ఇంజిన్ తయారీ వంటి అత్యంత సున్నితమైన సాంకేతికతను పంచుకోవడంపై ఇరు దేశాల శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, దేశీయ ఉత్పత్తి రంగంలో భారత్ ఒక భారీ ముందడుగు వేసినట్లే.

### బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్

ఈ అజెండాలో ముచ్చటగా మూడో కీలక అంశం, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అప్‌గ్రేడ్. భారత్, రష్యాల ఉమ్మడి రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి ఈ క్షిపణి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ఇప్పటికే భూ, జల, వాయు మార్గాల నుంచి ప్రయోగించేలా బ్రహ్మోస్ సక్సెస్ అయింది. ఇప్పుడు దీని రేంజ్, ఫీచర్లను పెంచి మరింత ఆధునీకరించాలని రష్యా కోరుతోంది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయ డిఫెన్స్ మార్కెట్‌లో బ్రహ్మోస్‌ను ప్రధాన ఆకర్షణగా మార్చాలనేది ఇరు దేశాల ప్లాన్. ఇప్పటికే పలు దేశాలకు బ్రహ్మోస్ ఎగుమతులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ కొత్త అప్‌గ్రేడ్ భారత్‌ను గ్లోబల్ డిఫెన్స్ ఎగుమతిదారుగా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది.

దశాబ్దాలుగా రష్యా అంటే భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి కూడా భారత్ భారీగా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో రష్యా తన పాత పద్ధతులను మార్చుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ భారత్ లాంటి నమ్మకమైన భాగస్వామిని మరింత చేరువ చేసుకునేందుకు, ఏకంగా సాంకేతికతనే పంచుకోవడానికి రష్యా సిద్ధపడటం విశేషం. పాత ఆయుధాల స్థానంలో జాయింట్ ప్రొడక్షన్, కొత్త టెక్నాలజీ, దేశీయ తయారీ ఇవే భవిష్యత్ భారత్-రష్యా రక్షణ బంధానికి పునాది కానున్నాయి. అందుకే ఈ సెప్టెంబర్ 11న జరిగే సమావేశం, భారత భద్రతా ముఖచిత్రాన్ని మార్చే కీలక ఘట్టంగా మారబోతోంది.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం

**ముంబై :** రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో



చూద్దాం.ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.

## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

### అసలేంటి వివాదం?

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది.

### సవరించిన పాఠ్య పుస్తకం

అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

### ముగిసిన కేసు

కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

# బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా – ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు.2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు

### 'దైవ లీల'గా ప్రచారం

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది.ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి. పూర్తి భద్రత హామీ ఇచ్చే వరకు విగ్రహాన్ని కదిలించే ప్రయత్నం చేయకూడదు" అని ఆయన తెలిపారు.

# కుప్పకూలిన వ్యవస్థ!

ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఒక ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. 'హాస్టల్ డేజ్' అనే విచిత్రమైన పేరుతో నడుస్తున్న ప్రైవేటు విద్యార్థి వసతిగృహంలో, ఇల్లు వదిలి చదువుకోసం వచ్చిన యువకులు కిక్కిరిసి ఉన్నారు. శిథిలాల్లో సహాయక బృందాలు గాలిస్తున్న కొద్దీ కనీసం ఏడుగురు మృతిచెందినట్టు నిర్ధారణ కాగా, మృతుల సంఖ్య ఇంకా పెరుగుతూనే ఉంది. డజన్ల కొద్దీ రాత్రంతా శిథిలాల్లో చిక్కుకుని, లేదా అత్యవసర చికిత్సలో గడిపారు. ఇది దైవఘటన కాదు. ఏళ్ల తరబడి కళ్లు మూసుకుని చూసీ చూడనట్టు వ్యవహరించిన ఒక వ్యవస్థ, ఊహించదగిన పర్యవసానమే! వెంటనే బయటపడిన కారణాలు కూడా అంతే స్పష్టం. ఈ నిర్మాణం దాదాపు 50 ఏళ్ల నాటిది, మొదట్లో నివాస భవనంగా కట్టి, తర్వాత అవసరమైన అనుమతులు లేకుండానే నిశ్శబ్దంగా చెల్లింపు అతిథి గృహంగా (పీజీ) మార్చేశారు. ఆగస్టులో మళ్లీ అద్దెదారులకు అప్పగించారు. అప్పుడు కూడా చుట్టూ పునరుద్ధరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. నివేదికల ప్రకారం, కార్మికులు బేస్‌మెంట్‌ను తవ్వుతూ, భారాన్ని మోసే గోడలను తొలగిస్తుండగా, రెండు అంతస్తుల పైన విద్యార్థులు నిద్రిస్తున్నారు. రెండు రోజుల రుతుపవన వర్షం అదే బేస్‌మెంట్‌లో నీటిని నిల్వ చేసింది. వరద నీటి నిల్వ, కొనసాగుతున్న మరమ్మతులే కూలిపోవడానికి కారణమని ఢిల్లీ సీఎం పేర్కొన్నారు. ఈ వాస్తవాల్లో ప్రతి ఒక్కటీ, విడివిడిగా చూసినా, ఒక ఉల్లంఘనే. అన్నీ కలిపి చూస్తే, ఒక్క అద్దెదారుడినైనా ఉంచకూడని భవనం గురించి చెబుతున్నాయి, కానీ ఇందులో డజన్ల కొద్దీ జనం ఉన్నారు. 186 సత్య నికేతన్ చిరునామాలో ఉన్న ఈ భవనంలో 15 గదులుండగా, ఒక్కో గదిలో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు ఉండేవారు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక మెడికల్ షాపు కూడా ఉండేది. కూలిపోయే సమయానికి భవనంలో 40నుంచి 50మంది వరకూ ఉన్నారని అంచనా. వీరిలో బిహార్, ఉత్తరప్రదేశ్‌తోసహా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతోపాటు, మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులూ ఉన్నారు.

అయితే, ఈ కుప్పకూలికను కేవలం ఒక్క గైర్హాజరు యజమానిపైనే నెట్టేసి, ఇప్పుడు అరెస్టై, అభియోగాలు ఎదుర్కొంటున్న అతడిపైనే బాధ్యత మోపడం, మిగతా అందరినీ చాలా తేలికగా వదిలేయడమే అవుతుంది. ఈ హాస్టల్‌కు లైసెన్స్ ఎవరో ఇచ్చి ఉండాలి, లేదా లైసెన్స్ లేకుండానే అది నడుస్తోందని ఎవరో గుర్తించడంలో విఫలమై ఉండాలి. ఈ భవనాన్ని ఎవరో తనిఖీ చేసి ఉండాలి, లేదా తనిఖీ చేయకుండానే క్లియరెన్స్ ఇచ్చి ఉండాలి. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ), తన భద్రతా విభాగం నుంచి ఐదుగురు అధికారులను, దక్షిణ మండల డిప్యూటీ కమిషనర్‌తోసహా నలుగురు స్ట్రక్చరల్ ఇంజినీర్లను సస్పెండ్ చేసింది. దీని పర్యవేక్షణ వ్యవస్థ కేవలం కాగితాలపైనే ఉందని, మరెక్కడా లేదన్న మౌన అంగీకారమే ఇది. ప్రతి రుతుపవన సీజన్‌లో, గడియారంలా క్రమం తప్పకుండా బాధితులతో సహా వచ్చిపడే ఈ విషాదాలను ఢిల్లీ కోల్పోతున్న శిథిల నిర్మాణాల్లో ఇది మొదటిది కాదు. ఇక్కడ కనిపిస్తున్న నిర్లక్ష్యం యాదృచ్ఛికం కాదు, ఇది వ్యవస్థ యొక్క స్థిరమైన స్థితి, అప్పుడప్పుడు జరిగే అంత్యక్రియలతో మాత్రమే అంతరాయం కలుగుతుంది. భద్రతా ఆందోళనల కారణంగా ఈ భవనాన్ని గతంలో ఖాళీ చేయించారని, అయితే తర్వాత మళ్లీ కార్యకలాపాల్లోకి తీసుకొచ్చారని కూడా వెల్లడైంది. అంటే, ప్రమాదాన్ని ఒకసారి గుర్తించి కూడా, తగిన చర్యలు తీసుకోకుండా అధికారులు వదిలేశారన్న మాట. భవన యజమాని హరి రామ్ బన్సాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కాగా, అతను పరారీలో ఉన్నాడని, అతడిపై లుక్‌అవుట్ నోటీసు జారీ చేసినట్టు సమాచారం. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు కాగా, ఆమోదం లేని వాణిజ్య విద్యార్థి వసతి గృహాల నిర్వహణకు సంబంధించి ఢిల్లీ వర్సిటీ, ఎంసీడీ రెండూ నియంత్రణ బాధ్యతను పంచుకుంటున్నాయని కోర్టు గుర్తుచేయడం గమనార్హం. ఈ ఘటనకు, ఒక బీజేపీ ఎమ్మెల్యేకు మధ్య రాజకీయ సంబంధాలు ఉన్నాయని ఒక విద్యార్థి సంఘం బహిరంగంగా ఆరోపించినా, ఆ ఆరోపణలు ఇంకా రుజువుకాలేదు, దర్యాప్తులో భాగంగా వీటిని పరిశీలించాల్సి ఉంది. ఈలోగా, పక్కనే ఉన్న మరో పీజీ భవనాన్ని ఎంసీడీ సీల్ చేసింది, ఢిల్లీ మేయర్ స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి, ఆమోదం లేని బహుళ అంతస్తుల నిర్మాణాలపై శిక్షాత్మక చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ఇలాంటి కుప్పకూలిక తర్వాత జరిగేది నిస్పృహకరంగా ముందే రాసిపెట్టుకున్న

## సంపాదకీయం

స్క్రిప్టులా ఉంటుంది. సంతాపాలు, ఒక అరెస్టు, న్యాయవిచారణ, ఆడిట్ల హామీలు. ఢిల్లీ ప్రభుత్వం ఇప్పటికే హాస్టళ్లు, నర్సింగ్ హోమ్‌లు, పాఠశాలలకు తప్పనిసరి నిర్మాణ ఆడిట్లు, భద్రతా సర్టిఫికెట్లను ప్రకటించింది. ఇది అవసరమైనదే, చాలా ఆలస్యంగా వచ్చిందే. కానీ అమలు మళ్లీ అదేవిధంగా విఫలమైతే విలువలేనిదే. సత్య నికేతన్ నివాసితులు ఇప్పటికే ఆరోపిస్తున్న లంచగొండితనం నుంచి రక్షణ పొందిన స్వతంత్ర తనిఖీ అధికారులు లేకుండా, ఆడిట్‌లకు పెద్దగా విలువ ఉండదు. ఒక విద్యార్థి లేదా తల్లిదండ్రులు లీజుపై సంతకం చేసేముందు తనిఖీ చేయగలిగే ప్రజా రిజిస్ట్రీ లేకుండా, సర్టిఫికేషన్‌కు పెద్దగా విలువ ఉండదు. సస్పెన్షన్ మాత్రమే జవాబుదారీతనానికి పైకప్పు కాకూడదు. చట్టవిరుద్ధ మార్పిడులను క్లియర్ చేసిన లేదా విస్మరించిన అధికారులు, వాటిని నిర్మించిన వ్యక్తులతో సమానంగా బాధ్యత వహించాల్సిందే. హాస్టల్ నడపడానికి ఎవరు అర్హులన్న నిబంధనలు ఢిల్లీకి లోటు లేదు. మృతదేహాలను లెక్కించే ముందు కాకుండా, ముందుగానే వాటిని అమలు చేసే సంకల్పమే లోటు. ఇది కేవలం ఢిల్లీ సమస్య మాత్రమే కాదు – భారత్‌లోని విశ్వవిద్యాలయ పట్టణాల్లో లక్షలాది మంది విద్యార్థులు ఇలాగే మార్చిన హాస్టళ్లలో నివసిస్తున్నారు, వదులుగా లైసెన్స్ పొందినవి, తనిఖీ చేసినా అదే షెడ్యూలుపైనే – ఏదైనా కూలిపోయేవరకూ ఎన్నడూ కాదు. నియమాలు రాయడం సరిపోదు, వాటిని నిజాయితీగా అమలు చేయడమే అసలైన సవాలు. భవన నిర్మాణ అనుమతులు, వాటి మార్పిడి, వినియోగ మార్పులను ఎప్పటికప్పుడు నిజ–సమయ డేటాబేస్‌లో నమోదు చేసి, ప్రజలు స్వేచ్ఛగా వెరిఫై చేసుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తనిఖీ అధికారులకు స్వతంత్రత కల్పించి, వారిపై నియంత్రణ ఉంచే ఉన్నతస్థాయి పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి. అవినీతిపరులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి కూడా భవన యజమానులతో సమానంగా క్రిమినల్ బాధ్యత వర్తింపజేయాలి. ఏడు కుటుంబాలు ఇప్పుడు ఆ అంతరం మూల్యం ఏమిటో తెలుసుకున్నాయి. తర్వాతి కుప్పకూలిక తర్వాత కాకుండా, తర్వాతి రుతుపవనానికి ముందే ఆ అంతరాన్ని మూసివేయడమే నిజాయితీగల నివాళి!

### పనికొచ్చే పలుకు



# కష్టపడటమే.. ముందు నేర్పించాలి!

పిల్లలకు కష్టం తెలియకుండా పెంచడం అంటే ప్రేమ చూపించడమే అనుకుంటాం. అడిగినది ఇవ్వడం, ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడడం, ఎదుర్కోవాల్సిన ప్రతి సమస్యనూ మనమే పరిష్కరించడం.. ఇవన్నీ ప్రేమకు ప్రతీకలుగానే కనిపిస్తాయి. కానీ ఒక చిన్న ప్రశ్న వేసుకోవాలి. మన పిల్లలకు కష్టాలు రాకుండా కాపాడుతున్నామా? లేక కష్టాలను ఎదుర్కొనే శక్తినే దూరం చేస్తున్నామా? జీవితం ఎప్పుడూ మనం కోరుకున్నట్టుగా ఉండదు. అందుకే పిల్లలకు ప్రతి అసౌకర్యం నుంచి రక్షణ కల్పించడం కంటే.. ఆ అసౌకర్యాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పించడం ముఖ్యం. 'జెంటిల్ పేరెంటింగ్' పేరుతో పిల్లలకు ప్రతి విషయంలోనూ అతిగా వెసులుబాటు ఇవ్వడం కొన్నిసార్లు వారి స్వతంత్రతకు బదులు ఆధారపడే మనస్తత్వాన్ని పెంచవచ్చు. ఏ పని చేయమన్నా ఇష్టం లేదంటే వదిలేయడం, తప్పు చేసినా పెద్దగా పట్టించుకోకపోవడం, నియమాలు పెట్టడానికి సంకోచించడం.. ఇవన్నీ పిల్లలపై ప్రేమగానే కనిపించినా, భవిష్యత్తులో వారి నిర్ణయ సామర్థ్యంపై ప్రభావం చూపవచ్చు. మరోవైపు కఠినమైన క్రమశిక్షణ పేరుతో పిల్లల అభిప్రాయాలను పూర్తిగా పట్టించుకోకపోవడం కూడా సరైన పద్ధతి కాదు. అందుకే ప్రేమకు హద్దులు.. స్వేచ్ఛకు బాధ్యత.. క్రమశిక్షణకు ఆప్యాయత కలిసిన 'అథారిటేటివ్ పేరెంటింగ్' అవసరం.

పిల్లల మాట వినడం అంటే వాళ్లు చెప్పిన ప్రతిదానికీ అంగీకరించడం కాదు. వాళ్లు ఎందుకు అలా ఆలోచిస్తున్నారో తెలుసుకోవడం. ఒక నియమం ఎందుకు పెట్టామో వివరించడం. తప్పు చేస్తే శిక్షించడం కంటే, ఆ తప్పు వల్ల కలిగే పరిణామాన్ని అర్థమయ్యేలా చెప్పడం. నిర్ణయం తీసుకునే అవకాశం ఇవ్వడంతో పాటు, ఆ నిర్ణయానికి సంబంధించిన బాధ్యతను కూడా వాళ్లకే అప్పగించడం. ఈ చిన్న చిన్న అలవాట్లే పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, బాధ్యత, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుతాయి. మంచి జీవనశైలి అంటే మనపై మనం కఠినంగా ఉండటం కాదు. మన భవిష్యత్తుపై బాధ్యతతో ఉండటం. ఆరోగ్యంగా ఉండాలనుకుంటే కొంత క్రమశిక్షణ అవసరం. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే కొన్ని నియమాలు అవసరం. ఆర్థికంగా ఎదగాలంటే ఖర్చులపై నియంత్రణ అవసరం. సంబంధాలు బాగుండాలంటే మన మాటకంటే ఎదుటివారి మాట వినే అలవాటు అవసరం. ఇవన్నీ ఒకే విషయాన్ని చెబుతాయి. స్వేచ్ఛ అంటే నియమాలు లేకపోవడం కాదు; సరైన నియమాలను మనమే ఎంచుకుని వాటికి కట్టుబడి ఉండటం.

జీవితంలో కష్టం పూర్తిగా తొలగిపోవాలని కోరుకోవడం సహజం. కానీ కష్టాలు లేని జీవితం కంటే, కష్టాలు వచ్చినా నిలబడగలిగే జీవితం విలువైనది. అందుకే పిల్లలను పెంచడంలోనైనా.. మనల్ని మనం తీర్చిదిద్దుకోవడంలోనైనా ఒక సమతుల్యత అవసరం. అతి ప్రేమ వద్దు.. అతి కఠినత కూడా వద్దు. ప్రేమ ఉండాలి.. కానీ దానికి దిశ చూపించే నియమం ఉండాలి. స్వేచ్ఛ ఉండాలి.. కానీ దానికి తోడు బాధ్యత ఉండాలి. తప్పులు చేసే అవకాశం ఉండాలి.. కానీ వాటి నుంచి నేర్చుకునే ధైర్యం కూడా ఉండాలి. చివరికి మంచి పేరెంటింగ్ మన పిల్లల భవిష్యత్తును మాత్రమే మార్చదు. అది మన జీవితాన్ని చూసే విధానాన్నీ మార్చగలదు. పిల్లలకు మనం నేర్పాలనుకునే క్రమశిక్షణను ముందుగా మనమే పాటిస్తే.. వాళ్లకు చెప్పే మాటలకంటే మన జీవితం గొప్ప పాఠంగా మారుతుంది. కష్టం నుంచి కాపాడటం కంటే.. కష్టాన్ని ఎదుర్కొనే శక్తిని ఇవ్వడం గొప్ప ప్రేమ. అదే సూత్రాన్ని మన జీవితానికీ వర్తింపజేస్తే.. జీవనశైలి మాత్రమే కాదు, మన వ్యక్తిత్వమే కొత్త రూపం దాల్చుతుంది.

# వ్యూహం నుంచి ఆచరణవైపు..




2026 ఆగస్టులో జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి భారత్ పర్యటన, తరచూ కార్యాచరణ కంటే సంస్థాగతంగానే ఎక్కువ అభివృద్ధి చెందిన ఒక భాగస్వామ్యం పరిణామంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ఆగస్టు 20న న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన కొయిజుమి, ఆస్ట్రేలియాతో కలిపి రెండు దేశాల పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారు. ప్రకటించిన ఒప్పందాలు, న్యూఢిల్లీ, టోక్యో ఇప్పుడు వార్షిక చర్చలు, 2+2 యంత్రాంగం, విన్యాసాలు, రవాణా ఏర్పాట్లు, రక్షణ సాంకేతిక చర్చల ద్వారా దశాబ్దానికిపైగా నిర్మించుకున్న సంస్థాగత భద్రతా పదజాలాన్ని, ఇప్పుడు మరింత పొందికైన భద్రతా సంబంధంగా అనుసంధానించే ప్రయత్నం చేస్తున్నాయని సూచిస్తున్నాయి. ఇది ముఖ్యమైనది ఎందుకంటే, భారత్–జపాన్ రక్షణ సంబంధం ఇప్పుడు అదనపు వ్యూహాత్మక సమన్వయ ప్రకటనలు క్షీణిస్తున్న రాబడులను ఇచ్చే దశకు చేరుకుంది. యథాతథ స్థితిని బలవంతంగా మార్చే ప్రయత్నాలు, సముద్ర ఉమ్మడి ప్రాంతాల భద్రత, ఇండో–పసిఫిక్‌లో పెరుగుతున్న సైనికీకరణ గురించి ఇరు దేశాలు ఇప్పటికే ఆందోళనలను పంచుకుంటున్నాయి. ఈ సమన్వయాలను వారి కలిసి పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరచే ఏర్పాట్లుగా మార్చడమే అసలైన సవాలు. కొత్త సముద్ర భద్రతా చట్రం ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తోంది. రాజ్‌నాథ్ సింగ్, కొయిజుమి సముద్ర భద్రతా సహకారంపై ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు, ఇది భారత నౌకాదళానికి, జపాన్ మారిటైమ్ సెల్ఫ్–డిఫెన్స్ ఫోర్స్‌కు మధ్య మరింత సన్నిహిత సహకారానికి చట్రాన్ని అందిస్తుంది.

సమాచార పంపిణీ, సముద్ర ప్రాంత అవగాహన (ఎండీఏ)పై ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమైనది, ఎందుకంటే భారత్, జపాన్ ఇండో–పసిఫిక్ ప్రధాన సముద్ర రంగానికి రెండు వ్యతిరేక చివరల్లో కీలక స్థానాలను ఆక్రమించి ఉన్నాయి. జపాన్ తక్షణ భద్రతా ఆందోళనలు తూర్పు చైనా సముద్రం, తైవాన్ చుట్టూ ఉన్న జలాల్లో కేంద్రీకృతమై ఉండగా, భారత్ భౌగోళిక స్థానం దానికి హిందూ మహాసముద్ర ప్రాంతంలో కేంద్ర పాత్రను ఇస్తుంది. మెరుగైన సమాచార పంపిణీ వ్యవస్థ, క్రమంగా ఈ పరస్పర అనుసంధానిత సముద్ర ప్రాంతాల్లో మరింత నిరంతర వ్యూహాత్మక చిత్రాన్ని సృష్టించగలదు. ఈ రెండు ప్రధాన సముద్ర శక్తుల మధ్య మరింత అవగాహన, పరస్పర కార్యాచరణ సామర్థ్యం, కార్యాచరణ పరిచయాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం. నౌకా నిర్మాణంపై చర్చలు కూడా అంతే ముఖ్యమైనవి కావొచ్చు – జపాన్ సాంకేతిక నైపుణ్యాన్ని, భారత ఉత్పత్తి సామర్థ్యాలను కలిపి నౌకా నిర్మాణం, డిజైన్‌లో సంయుక్త అభివృద్ధిని అన్వేషించాలని నిర్ణయించారు. మేక్ ఇన్ ఇండియా చట్రం కింద భారత ఉత్పత్తి సామర్థ్యాలను జపాన్ వినియోగించుకోవడంపై చర్చలను మరింత లోతుగా చేయాలని, నౌకా మరమ్మతు సదుపాయాలకు పరస్పర ఏర్పాట్ల వైపు కదలాలని కూడా ఒప్పందం కుదిరింది – ఇది ద్వైపాక్షిక సంబంధంలో దీర్ఘకాలిక బలహీనతను పరిష్కరించి, వ్యూహాత్మక, రాజకీయ సమన్వయం కంటే స్థిరంగా వెనుకబడిన రక్షణ–పారిశ్రామిక సహకారానికి ఊతమివ్వగలదు. జపాన్ యూనికార్న్ సమీకృత కమ్యూనికేషన్ల యాంటెన్నా వ్యవస్థను (నౌకల్లో స్టెల్త్ సాంకేతికత) బదిలీ చేయాలన్న ప్రతిపాదన, ఈ ప్రయత్నానికి అత్యంత కనిపించే చిహ్నంగా మిగిలింది – జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ దీన్ని రెండు దేశాల మధ్య తొలి రక్షణ పరికరాల బదిలీ ప్రాజెక్టుగా అభివర్ణించినా, ఈ ప్రాజెక్టు కొత్తదేమీ కాదు – భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) భాగస్వామ్యంతో యూనికార్న్ మాస్ట్‌ల సహ–అభివృద్ధికి 2024 నవంబర్‌లోనే ఒక అవగాహన ఒప్పందంపై సంతకం జరిగింది. కాబట్టి, ఆగస్టు సమావేశం కొత్త ప్రాజెక్టు ప్రారంభానికి బదులు, అమలు దిశగా మరో ముందడుగుగా నిలిచింది.

న్యూఢిల్లీ, టోక్యోలు తమ 2015 నాటి రక్షణ పరికరాలు, సాంకేతిక బదిలీ ఒప్పందాన్ని నిర్దిష్ట ఫలితాలుగా మార్చడంలో ఇబ్బంది పడుతూనే ఉన్నాయి. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), జపాన్ సముపార్జన, సాంకేతిక, రవాణా సంస్థ మధ్య సహకారాన్ని లోతుగా చేసే ప్రణాళికలతోపాటు, ఇప్పుడు ముందస్తు అమలుపై చూపిస్తున్న నిబద్ధత, అవకాశాలను గుర్తించడం మాత్రమే కాకుండా, ఫలితాలను అందించడంపైనే నేటి విశ్వసనీయత ఆధారపడి ఉందన్న గుర్తింపును సూచిస్తోంది. విన్యాసాల విషయానికొస్తే, జపాన్ యుద్ధ విమానాలు తొలిసారిగా భారత్‌లో వీర్ గార్డియన్ విన్యాసంలో (సెప్టెంబర్ 9–22, 2026) పాల్గొంటున్నాయి. ద్వైపాక్షిక విన్యాసాల సంక్లిష్టతను పెంచడానికి, మానవరహిత వ్యవస్థలను అనుసంధానించడానికి, తక్కువ నోటీసుతో నిర్వహించే విన్యాసాలను అన్వేషించడానికి ఇరు పక్షాలూ అంగీకరించాయి. ప్రత్యేక కార్యాచరణ దళాల మధ్య సహకారం, భారత్ భవిష్యత్ సమీకృత థియేటర్ కమాండ్‌ల గురించి కూడా వారు చర్చించారు. ఈ కార్యక్రమాలు కార్యాచరణ సన్నద్ధతపై పెరుగుతున్న శ్రద్ధతో కూడిన రక్షణ సంబంధాన్ని సూచిస్తున్నాయి. న్యూఢిల్లీకి ప్రయాణించడానికి ముందు, కొయిజుమి ముంబైలోని పశ్చిమ నౌకాదళ కమాండ్‌ను, ఐఎన్ఎస్ చెన్నైని సందర్శించారు. దీంతో ఆయన పర్యటన బంగాళాఖాతం, మలక్కా జలసంధి అనే సుపరిచిత వ్యూహాత్మక భౌగోళికతను దాటి విస్తరించింది. పశ్చిమ తీరం భారత్ విస్తృత సముద్ర ప్రయోజనాలకు కేంద్రం. కీలక సముద్ర మార్గాలు, ఇంధన ప్రవాహాలు, పశ్చిమ హిందూ మహా సముద్రంలో పెరుగుతున్న భారత బాధ్యతలను కలిగి ఉంది.

విస్తృత ప్రాంతీయ నేపథ్యాన్ని విస్మరించలేం. నౌకాయాన స్వేచ్ఛకు ఆటంకం కలిగించే లేదా బలవంతంగా, బెదిరింపుల ద్వారా యథాతథ స్థితిని మార్చాలని చూసే ఏకపక్ష చర్యలను వ్యతిరేకిస్తూ సంయుక్త ప్రకటన పునరుద్ఘాటించింది. వ్యూహాత్మక సందేశం స్పష్టంగా ఉండటానికి ఏ దేశమూ చైనా పేరు ప్రస్తావించాల్సిన అవసరం లేకపోయింది. అయితే, భారత్–జపాన్ సహకారం ప్రాముఖ్యత సరిగ్గా చైనా–కేంద్రీకృత ఎజెండాను దాటి ముందుకు సాగగల సామర్థ్యంలోనే ఉంది. సముద్ర భద్రత, స్థితిస్థాపక సరఫరా గొలుసులు, రక్షణ పారిశ్రామిక సామర్థ్యం, రవాణా, మూడో దేశాలతో సహకారం –ఇవన్నీ విస్తృత ప్రాంతీయ భద్రతా నిర్మాణంలో భాగాలుగా మారుతున్నాయి. ఈ పర్యటన, భారత్–జపాన్ సంబంధాల్లో విస్తృత ఊపు క్షణంతోనూ ముడిపడి ఉంది. ఆర్థిక భద్రత, కీలక సాంకేతికతలు, స్థితిస్థాపక సరఫరా గొలుసుల్లో సహకారాన్ని విస్తరించిన 2026 జులై వార్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత వెంటనే వచ్చిన ఈ రక్షణ మంత్రిత్వ స్థాయి భేటీ, భద్రత ఇప్పుడు విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఎంతగా ముడిపడుతోందో నిరూపిస్తోంది. భారత పారిశ్రామిక సామర్థ్యాలను, జపాన్ సాంకేతిక బలాలను అనుసంధానిస్తూ, మరింత స్థితిస్థాపక ఇండో–పసిఫిక్‌ను తీర్చిదిద్దాలన్న వారి ఉమ్మడి ఆసక్తిని బలోపేతం చేస్తూ, రక్షణ సహకారం ఈ ఎజెండాల మధ్య అనుసంధాన కణజాలాన్ని అందించగలదు. అసలైన పరీక్ష ఇప్పుడు అమలులోనే ఉంటుంది. భారత్, జపాన్ వ్యూహాత్మక పునాదులను నిర్మిస్తున్నాయి, కొయిజుమి పర్యటన రెండు దేశాలూ చివరకు కష్టతరమైన పనిపై దృష్టి పెట్టడం మొదలుపెట్టాయని సూచిస్తోంది. అదే వ్యూహాత్మక సమన్వయాన్ని వినియోగించదగిన సామర్థ్యంగా మార్చడం. ■




పరిస్థితులన్నీ ప్రతికూలంగా మారినప్పుడు మీరు ఆధారపడదగిన ఆయుధం ఏంటో తెలుసా..? శ్రమ! రోజూ శ్రమిస్తూనే ఉండండి. ఫలితం వెంటనే కనిపించకపోయినా ఆగిపోకండి. ఎందుకంటే ప్రతి ప్రయత్నం మిమ్మల్ని మీ లక్ష్యానికి కొంచెం దగ్గర చేస్తుంది. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా.. నిరంతర శ్రమ ముందు అవి ఎంతోకాలం నిలబడలేవు. శ్రమకు పట్టుదల తోడైతే అసాధ్యం అనుకున్నదీ సాధ్యమవుతుంది. కాబట్టి పరిస్థితులు మారే వరకు ఎదురుచూడకండి.. మీ శ్రమతోనే పరిస్థితులను మార్చే ప్రయత్నం చేయండి. అది కచ్చితంగా మళ్లీ మిమ్మల్ని విజయపథంలోకి తీసుకెళ్తుంది.

-మహాదేవ

### వింతల్లో వింతలు

# బిగ్‌ఫుట్ కోసం వేట..!



అమెరికాలోని మైనే రాష్ట్రం డమారిస్కొట్టా పట్టణంలో వరుసగా 'బిగ్‌ఫుట్' కనిపించిందంటూ పోలీసులకు భారీగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. బిగ్‌ఫుట్ అనుకున్నది ఓ వ్యక్తి ధరించిన అత్యంత వాస్తవికమైన కాస్ట్యూమ్ అని తేలింది. అయితే ఈ ఘటనతో నిరాశ చెందకుండా.. తమ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండటం, ఒకరి కోసం మరొకరు స్పందించడం గొప్ప విషయమని పోలీసులు పేర్కొన్నారు. "బిగ్‌ఫుట్ దొరకలేదు.. కానీ పరస్పరం చూసుకునే అరుదైన సమాజం కనిపించింది" అంటూ అభినందించారు.



# హోరాహోరీ పోరులో ఆల్కరాజ్ ఔట్..

## యూఎస్ ఓపెన్ సెమీస్‌లోకి బెన్ షెల్టన్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాజ్ నిష్క్రమించాడు. ఇవాళ హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అమెరికన్ ప్లేయర్ బెన్ షెల్టన్ అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. అయిదు సెట్ల థ్రిల్లింగ్ మ్యాచ్‌ను 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(7) స్కోరుతో షెల్టన్ గెలుచుకున్నాడు. మడిమ గాయం నుంచి కోలుకుని టోర్నీలో అడుగుపెట్టిన అల్కరాజ్.. ఈ మ్యాచ్‌లో చివరి వరకు పోరాడు. సుమారు 4 గంటల 28 నిమిషాల పాటు ఈ మ్యాచ్ జరిగింది. అల్కరాజ్‌పై తన కెరీర్‌లో తొలిసారి విజయం సాధించాడు బెన్. నాలుగు నెలల గాయం తర్వాత అల్కరాజ్ ఆడిన ఫస్ట్ టోర్నీ ఇదే. కానీ అతని ఆశలపై నీళ్లు చల్లాడు యువ ప్లేయర్ షెల్టన్. గాయం వల్ల స్పెయిన్ ప్లేయర్ అల్కరాజ్ సరైన రీతిలో తన సత్తాను ప్రదర్శించలేకపోయాడు. సమారు 52 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేశాడు. టై బ్రేకర్ వరకు వెళ్లిన తొలి సెట్‌ను అల్కరాజ్ చివరకు సొంతం చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత చాలా భీకరంగా షెల్టన్ చెలరేగిపోయాడు. రెండవ, మూడవ సెట్లను బెన్ ఈజీగా నెగ్గేశాడు. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. కానీ నాలుగో సెట్‌లో అల్కరాజ్ తన రిథమ్‌ను మళ్లీ అందుకున్నాడు. బేస్‌లైన్ షాట్లు, స్పీడ్‌తో ఆ సెట్‌ను 6-1 తేడాతో నెగ్గి మ్యాచ్‌ను డిసైడర్ సెట్‌లోకి పంపాడు. ఇక ఆ ఫైనల్ సెట్‌లో ఇద్దరూ అమీతుమీ అన్నట్లుగా ఆడారు. సూపర్ టైబ్రేక్‌కు ఆ సెట్ వెళ్లింది. స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు తీవ్ర ఉత్కంఠకు లోనయ్యారు. కానీ చివరకు బెన్ షెల్టన్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. 10-7తో టైబ్రేక్ సాధించాడు. దీంతో అతను రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో క్వార్టర్స్ మ్యాచ్‌ను ఆలస్యంగా ప్రారంభించారు. దీనికి తోడుగా 4 గంటలకు పైగా మ్యాచ్ సాగడం వల్ల.. తెల్లవారుజామున మూడున్నరకు మ్యాచ్ ముగిసింది.

# 100 వికెట్ల క్లబ్‌లో రాబిన్సన్ 'స్పెషల్'!

- 24వ టెస్టులోనే వంద వికెట్ల మైలురాయి
- సయీమ్ అయూబ్‌ను ఔట్ చేసి ఘనత
- 20లోపు సగటుతో అరుదైన రికార్డు
- బుమ్రా సరసన ఇంగ్లండ్ పేసర్
- పాక్‌పై వరుసగా మూడో టెస్టులోనూ జోరు





ఇంగ్లండ్ పేసర్ ఓలీ రాబిన్సన్ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. పాకిస్థాన్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం ప్రారంభమైన మూడో టెస్టులో సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి తన టెస్టు కెరీర్‌లో 100వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు. 32 ఏళ్ల రాబిన్సన్‌కు ఇది 24వ టెస్టు కావడం విశేషం. అంతేకాదు.. 100 వికెట్ల మైలురాయి చేరే సమయానికి 20 కంటే తక్కువ బౌలింగ్ సగటు కలిగిన అత్యంత అరుదైన ఆధునిక బౌలర్ల జాబితాలో రాబిన్సన్ చోటు సంపాదించాడు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గత వందేళ్లలో 100 టెస్టు వికెట్లు తీసిన సమయంలో అత్యుత్తమ సగటు నమోదు చేసిన బౌలర్‌గా రాబిన్సన్ నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా పేరిట ఉన్న రికార్డును అధిగమించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### సయీమ్‌తోనే 'సెంచరీ'

టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. రాబిన్సన్ తన తొలి ఓవర్‌లోనే సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసినప్పటికీ సమీక్షలో నిర్ణయం మారింది. అయితే తన తర్వాతి ఓవర్‌లోనే సయీమ్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపి 100వ వికెట్ మైలురాయిని అందుకున్నాడు.

### పాక్‌పై రాబిన్సన్ 'రాజ్'

ప్రస్తుత సిరీస్‌లో రాబిన్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టులోనూ 4-11, 4-24తో మరో ఎనిమిది వికెట్లు తీసి వరుసగా రెండోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండేళ్లకు పైగా టెస్టు జట్టుకు దూరంగా ఉండి తిరిగి వచ్చిన రాబిన్సన్.. ఇప్పుడు 100 వికెట్ల మైలురాయితో తన పునరాగమనాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకున్నాడు.

# రూ.130 కోట్లకు పైగా డీల్!

## బీసీసీఐతో చాట్‌జీపీటీ, క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్ ఒప్పందం

- మూడు దిగ్గజ బ్రాండ్లు అసోసియేట్ పార్ట్‌నర్లుగా ఎంపిక
- రూ.130 కోట్లకు పైగా ఆదాయంతో 44 శాతం వృద్ధి
- 2028 మార్చి వరకు భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు వర్తింపు





భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తమ స్వదేశీ క్రికెట్ సీజన్‌కు సంబంధించి ప్రముఖ పానీయాల బ్రాండ్ 'క్యాంపా', ఇన్సూరెన్స్ సంస్థ 'ఎస్‌బీఐ లైఫ్'తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'చాట్‌జీపీటీ'లను అసోసియేట్ పార్ట్‌నర్లుగా ప్రకటించింది. రాబోయే వెస్టిండీస్ సిరీస్‌తో ప్రారంభమై 2028 మార్చి వరకు (మొత్తం 35 మ్యాచ్‌లకు) ఈ భాగస్వామ్యం అమల్లో ఉండనుంది. ఈ రెండు సీజన్ల ఒప్పందం ద్వారా బీసీసీఐకి రూ.130 కోట్లకు పైగా ఆదాయం లభించనుండగా, గత సైకిల్‌తో పోలిస్తే ఒప్పంద విలువ ఏకంగా 44 శాతం పెరగడం విశేషం. బిడ్డింగ్‌లో క్యాంపా కోలా మ్యాచ్‌కు రూ.1.31 కోట్లు, ఎస్‌బీఐ లైఫ్ మరియు చాట్‌జీపీటీ మ్యాచ్‌కు రూ.1.2 కోట్ల చొప్పున బిడ్లు దాఖలు చేసి భాగస్వామ్య హక్కులను సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఏఐ, ఇన్సూరెన్స్, బెవరేజెస్ వంటి విభిన్న రంగానికి చెందిన అంతర్జాతీయ బ్రాండ్లు భారత క్రికెట్‌పై చూపుతున్న నమ్మకానికి ఈ భారీ డీల్ నిదర్శనమని తెలిపారు. భారత హోమ్ సీజన్ మార్కెట్‌లో ఎంతటి క్రేజ్, డిమాండ్ ఉందో ఈ 44 శాతం వృద్ధి స్పష్టం చేస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. గ్రౌండ్ బ్రాండింగ్, బ్రాడ్‌కాస్ట్ గ్రాఫిక్స్ ద్వారా ఈ బ్రాండ్లు ప్రచారం పొందనున్నాయి.

# 'ఎపిక్' సబ్కో సాంగ్.. విదేశాల్లో స్టూడెంట్ లైఫ్ ఇలా..

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' నుంచి నాలుగో పాటగా 'సబ్కో' రిలీజ్ అయ్యింది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించారు. ఇప్పటివరకు వచ్చిన పాటల్లో ప్రేమకు ఎక్కువ చోటు కనిపిస్తే, ఈసారి ఫ్రెండ్స్ గ్యాంగ్ వైపు వెళ్లారు. చదువు కోసం విదేశాలకు వెళ్లిన స్టూడెంట్స్ అక్కడ ఎలా ఉంటారు, వాళ్ల రోజువారీ లైఫ్ ఎలా మారుతుంది అనే విషయాలను పాటలో చూపించారు.లండన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాట సాగుతుంది. లండన్ ఐ, డబుల్ డెక్కర్ బస్సులు, అక్కడి వీధులు, బీచ్ లొకేషన్స్ హైలెట్ అయ్యాయి. కానీ కేవలం లొకేషన్స్ చూపించడంతో ఆగలేదు. పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం, సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనడం, రూమ్‌లో వంట చేసుకోవడం, అసైన్‌మెంట్స్‌తో కూర్చోవడం లాంటి స్టూడెంట్ లైఫ్ మూమెంట్స్ కూడా పెట్టారు. విదేశాల్లో చదివిన వాళ్లకు తెలిసిన చిన్న చిన్న విషయాలనే పాటలో ఎక్కువగా వాడారు.శ్రీ హర్ష ఇమాని రాసిన లిరిక్స్ కూడా అదే లైన్‌లో సాగుతాయి. "దేశం కాని దేశంలో" అంటూ ఇంటికి దూరంగా ఉన్న యువత పరిస్థితిని చెబుతూనే, కొత్త ఫ్రెండ్స్‌తో ఏర్పడే బంధాన్ని తీసుకొచ్చారు. అక్కడ ఎదురయ్యే కష్టాలను మాత్రమే కాకుండా, వాటి మధ్యలో వచ్చే సరదాను కూడా పాటలో కలిపారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా సంజిత్ హెగ్డే, సితార కృష్ణకుమార్ ఈ పాటను పాడారు. ఆనంద్, వైష్ణవి మధ్య ట్రాక్ కూడా పాటలో పూర్తిగా పక్కన పెట్టలేదు. ఫ్రెండ్స్‌తో కలిసి పబ్‌కు వెళ్లడం, బయట తిరగడం, ఒకరితో ఒకరు టైమ్ గడపడం కనిపిస్తుంది. బోర్డ్ గేమ్ ఆడే సీన్, చిన్న రొమాంటిక్ మూమెంట్స్ కూడా ఉన్నాయి. అంటే ఇది పూర్తిగా ఫ్రెండ్‌షిప్ సాంగ్ కాకుండా, వాళ్లిద్దరి రిలేషన్ కూడా అదే గ్రూప్ లైఫ్ మధ్యలో ఎలా పెరుగుతుందో చూపించేలా పెట్టారు.








'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా ఇదే. కానీ ఈసారి వాళ్ల మధ్య కథ పూర్తిగా వేరే సెటప్‌లో ఉంది. ఆదిత్య హాసన్ '90s ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' తర్వాత చేస్తున్న ఫీచర్ ఫిల్మ్ కావడంతో, మిడిల్ క్లాస్ యువత విదేశాలకు వెళ్లాక వచ్చే మరో జీవితాన్ని ఈ కథలో తీసుకున్నాడు. 'సబ్కో' పాటలో ఆ భాగం ఎక్కువగా బయటపడింది.

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. రిలీజ్‌కు పది రోజుల ముందు ఈ పాటను తీసుకొచ్చారు. ప్రస్తుతం చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కాలేజీల్లో ప్రమోషన్స్ చేస్తోంది. 'సబ్కో'ను కూడా స్టూడెంట్స్ మధ్య విడుదల చేశారు. ఇక సినిమా కంటెంట్ లేటెస్ట్ జనరేషన్ కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో చూడాలి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com